
వార్త
ఆదివారం
4 జూన్, 2023
ఊపిరికి ఉరి
కాలుష్యం





# జంటగా బన్నీ, సంయుక్త మీనన్?

అల్లు అర్జున్ తన సినిమాలకి సంబంధించిన కథల ఎంపికలో చాలా కేర్ తీసుకుంటూ ఉంటాడు. 'నా పేరు సూర్య' ఫ్లాప్ తరువాత త్రివిక్రమ్‌తోనే సినిమా చేయాలనే పట్టుదలతో ఆయన చాలా రోజులు ఎదురు చూశాడు. 'అల వైకుంఠపురములో' సినిమాతో అందుకు తగిన ఫలితం కూడా దక్కింది. త్రివిక్రమ్‌తో హ్యాట్రిక్ హిట్ అందుకున్న బన్నీ ఆయనతో మరో సినిమా చేయనున్నట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందడం దాదాపు ఖరారైపోయిందని అంటున్నారు. మహేశ్ తరువాత త్రివిక్రమ్ చేసే సినిమా బన్నీతోనే ఉంటుందని తెలుస్తోంది. ప్రస్తుతం సుకుమార్ దర్శకత్వంలో బన్నీ 'పుష్ప 2' చేస్తున్నాడు. ఆ తరువాత సినిమాను ఆయన బోయపాటితో చేయవలసి ఉంది. అయితే ఆయన 'అఖండ' సీక్వెల్ పనిలో పడే అవకాశాలు ఉన్నాయి. అందువల్ల త్రివిక్రమ్‌తో ప్రాజెక్టును సెట్ చేస్తున్నట్టుగా సమాచారం. ఈ సినిమాలో ఒక కథానాయికగా సంయుక్త మీనన్ కనిపించనున్నట్లు తెలుస్తోంది.

---

## తారాతీరం





# 'దేవర' సినిమాలో మలయాళ నటుడు?

ఎన్టీఆర్ కథానాయకుడుగా కొరటాల శివ దర్శకత్వంలో 'దేవర' చిత్రం రూపొందుతోంది. ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ సినిమా నిర్మితమవుతోంది. ఇటీవలే ఈ సినిమాకి టైటిల్ ఖరారైంది. ఇందులో కథానాయికగా జాన్వీకపూర్ నటించనుంది. ఈ సినిమాలో పవర్‌ఫుల్ విలన్ పాత్రకి సైఫ్ అలీఖాన్‌ను తీసుకున్నారు. ఈ ఇద్దరి కాంబినేషన్ లోని సన్నివేశాలు ఓ రేంజ్‌లో వుంటాయట. కథ ప్రకారం హీరోను మరో ట్రాక్‌లో ఎదుర్కొనే ఇంకో విలన్ ఉంటాడని, ఆ పాత్ర కోసం మలయాళ నటుడు షైన్ టామ్ చాకోను తీసుకున్నట్లు సమాచారం.

ఇటీవల వచ్చిన 'దసరా' సినిమాలో విలన్‌గా నటించాడు. ఇక ఈ సినిమాలో జాన్వీకపూర్ జాలరి గూడానికి చెందిన యువతిగా కాస్త డీ గ్లామర్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుసోంది. ప్రకాశ్‌రాజ్ ముఖ్యమైన పాత్రను పోషించిన ఈ సినిమాకి అనిరుధ్ సంగీతం అందించాడు.

ఆదివారం వార్త

4 జూన్, 2023

## మంచి ముత్యాలు

మరణం, జీవితం అన్నవి ఈ ప్రపంచపు ఒడ్డుపైన అవిశ్రాంతంగా పోరాడుతుంటాయి.

- నార్టన్

## విషయ విశేషం

బడికి పోదామా!... 4

'సంఘీ'భావం....5

ఉచితాలతో వ్యవస్థలు నిర్వీర్యం

కవర్ స్టోరీ..6

ఊపిరికి ఉరి

కాలుష్యం

నదికింద మెట్రో పయనం..11

ఈవారం కవిత్వం..12

యాత్రా స్మృతులు

విదేశీవిద్యకు ప్రణాళిక..15

కథ.. 20

ప్రేమ మూట

జీవితం సహజంగా సాగిపోవాలి..25

పావనప్రదం 'పాలంక' సందర్శనం.....26

చిన్న కోడలు....30

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

# తాజా వార్తలు

## చల్లదనాన్ని ఇచ్చే బెల్ట్



బయట వేడిగా ఉన్నప్పుడు అడుగు పెట్టాలంటే కష్టమే! ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు ఇదివరకటి కాలంలో గొడుగులు ఉపయోగించేవారు. గొడుగులు తల మీద కాస్తంత నీడనివ్వగలవేమో గాని, ఒంటికి చల్లదనాన్ని ఇవ్వలేవు. అయితే, ఈ ఫొటోలోని వ్యక్తి తొడుక్కున్న బెల్ట్‌లాంటిది మీరూ తొడుక్కుంటే, ఎండలో కూడా హాయిగా బయట వ్యాహ్యాళికి వెళ్లొచ్చు. ఎందుకంటే, ఇది ఏసీ బెల్ట్. కెనడా కంపెనీ 'స్పార్కిల్ టీమ్' దీనిని రూపొందించింది. 'స్పార్కిల్ టోర్నడో' పేరిట రూపొందించిన ఈ బెల్ట్ చుట్టూ ఐదుఫ్యాన్లు ఉంటాయి. ఇది 12 వోల్టేజీల రీచార్జబుల్ బ్యాటరీతో పనిచేస్తుంది. ఇందులోని ఫ్యాన్లు చప్పుడు చేయకుండా తిరుగుతూ, 500 మిల్లీమీటర్ల వ్యాసార్ధం పరిధిలో ఉన్న గాలిని చల్లబరుస్తాయి. ఇవి నిమిషానికి 583లీటర్ల గాలిని చల్లబరుస్తూ, ఒంటికి వేడి సోకకుండా రక్షణనిస్తాయి. ఇందులోని బ్యాటరీని పూర్తిగా చార్జ్ చేసుకుంటే, మూడుగంటల సేపు నిరంతరాయంగా పనిచేస్తుంది. మూడుగంటల కంటే ఎక్కువసేపు బయట ఎండలో గడపాల్సి వస్తే, పవర్‌బ్యాంక్‌ను వెంట తీసుకుపోవడం ఉత్తమం. 'స్పార్కిల్ టీమ్' క్రౌడ్ ఫండింగ్ ద్వారా దీని ఉత్పత్తి చేపట్టనుంది.

### నీటిని శుభ్రం చేస్తుంది

ఇది ఆధునాతనమైన వాటర్ డిసిన్ఫెక్షన్ సిస్టమ్. అమెరికన్ కంపెనీ 'ఆక్సిసెన్స్' ఇటీవల దీనికి రూపకల్పన చేసింది. 'పెర్ల్ ఆక్వా డెకా 30సీ' పేరిట రూపొందించిన ఈ వాటర్ డిసిన్ఫెక్షన్ సిస్టమ్ నీటిలో సాధారణంగా ఉండే ప్రమాదకరమైన సూక్ష్మజీవులను 99.0శాతం మేరకు నాశనం చేస్తాయి. ఇళ్లల్లోనే కాకుండా, వాణిజ్య సంస్థల్లోనూ, కార్యాలయాల్లోను వినియోగించుకోవడానికి ఇది చాలా అనువుగా ఉంటుందని 'ఆక్సిసెన్స్' సిఈవో ఆలివర్ లావాల్ చెబుతున్నారు. దీని ధర 500, డాలర్ల (రూ.40.957)



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com






# బడికి పోదామా!

పిల్లలు స్కూలుకు వెళ్లే సమయం ఇది. కొత్తగా తరగతి గదులకు వెళ్తున్న చిన్నారులు ఏడవడం సహజం. వారికి అంతా కొత్తగా అనిపిస్తుంది. తోడుగా అమ్మ లేకపోతే ఇక వారి దిగులు అంతాఇంతా కాదు. ఇలాంటి చిన్నారులకు వారి మనసుకు నచ్చే బ్యాగ్ కొనిస్తే ఇట్టే బడికి సిద్ధమవుతారు. లేటేస్ట్ పుస్తకాల బ్యాగ్స్ మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. మరి వారికిష్టమైన బ్యాగ్‌ను కొనిపెట్టెందుకు ఆలస్యం ఎందుకు?

టీ స్ట్రెయినర్, టీ ఇన్‌ఫ్యూజర్..రకం ఏదైనా ఉపయోగం మాత్రం ఒక్కటే. మనసుని తేలికపరిచే తేనీటికి రుచిని తెచ్చే వీటిని సాదాసీదాగా వాడేస్తే ఏం బాగుంటుంది? కానీ నిజానికి ఒకప్పుడు టీని పల్చని నూలు వస్త్రంలో వడకట్టేవారు. తర్వాత ప్లాస్టిక్‌తో చేసిన వడకట్టూలూ వచ్చాయి. ఆపై కాగితం సాచెర్లలో టీ పొడిని ముంచి తీసేతీరు మొదలయ్యింది. ఇవన్నీ సౌకర్యం కోసం వచ్చినవే. అయితే ఇప్పుడు దాంతోపాటూ వాటి లుక్కూ ముఖ్యమే అంటున్నారు. అలాంటివారి కోసం ఇత్తడితో చేసిన స్ట్రెయినర్లూ, ఇన్‌ఫ్యూజర్లూ అందుబాటులోకి వచ్చాయి. నక్షత్రం మొదలుకుని బుట్టల వరకూ ఎన్నో ఆకృతుల్లో దొరుకుతున్నాయి. బంగారురంగులో మెరిసిపోతున్నాయి. మీరు కొని వాడండి.




# ఇత్తడి స్ట్రెయినర్లు





# 'సంఘీ' భావం



# ఉచితాలతో వ్యవస్థలు నిర్వీర్యం

**తెలుగు** రాష్ట్రాలతో పాటు పార్లమెంటు ఎన్నికలు కూడా సమీపిస్తున్నాయి. తెలంగాణలో ఈ డిసెంబరులోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ముందస్తుకు అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఇదే నిజమైతే ఏపీ ఎన్నికలు కూడా తెలంగాణతో నిర్వహించే అవకాశాలు ఉంటాయి. ఆర్థికపరమైన సమస్యలు అధికంగా ఉన్నందున ముందస్తుకు వెళ్లడమే సముచితమని వైఎస్సార్సీపీ వర్గాలు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం అందుతోంది. ఇక పార్లమెంటు ఎన్నికలు వచ్చే సంవత్సరంలో జరుగుతాయి. దీనితో ఇప్పటి నుంచే ఎన్నికల వాతావరణం నెలకొంది. నేతలు పాదయాత్రలు, సమన్వయ, ఆత్మీయ సమావేశాలు, భారీ బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. పాదయాత్రల ప్రభావం ఎన్నికల్లో కలిసొచ్చే అంశంగా గుర్తింపు పొందడంతో కొందరు నేతలు పాదయాత్రలకు శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్, బిజెపిలకు చెందిన అగ్రనేతలు విస్తృత పర్యటనలు చేస్తున్నారు. ఇక పార్టీ అధిష్టానాలు జనాకర్షక మ్యానిఫెస్టోల రూపకల్పనలో బిజీబిజీగా ఉన్నారు. కర్ణాటక ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్ పోటాపోటీగా ఉచితాలతో మ్యానిఫెస్టోలు రూపొందించి ప్రజల ముందు వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో అత్యధిక ఉచితాలు ఉండటం పార్టీ విజయానికి కొంత ప్రయోజనం చేకూరిందని వివిధ సర్వేల్లో వెల్లడైంది. సాధారణంగా ఎప్పటి నుంచో తమిళనాడులో ఉచితాల వెల్లువ అధికంగా ఉంటుంది. ఉచితం మోపెడ్లు, టివిలు, కూలర్లు, గడియారాలు వంటివి ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. ఇది క్రమంగా దక్షిణాదిలో మిగిలిన రాష్ట్రాలకు పాకింది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో రైతులకు ధీమా, బీమా పేరుతో డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. తెలంగాణలో దళిత ఓట్లను ఆకర్షించేందుకు పది లక్షల రూపాయలు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకుండా ఆర్థిక సహాయం చేస్తున్నారు. ఇదే పథకాన్ని బిసిలకు కూడా వర్తింపచేయాలని డిమాండ్ ప్రారంభమైంది. ఏపీలో అమ్మఒడి, విద్యాదీవెన, జగనన్న చేదోడు, జగనన్న పెన్షన్ కానుక, నవోదయం, కల్యాణ కానుక, రైతు భరోసా, చేతోడు, తోడు, మత్స్యకార భరోసా వంటి అనేక పథకాలకు వేలకోట్ల రూపాయలు లబ్దిదారుల ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. ప్రతి నెలా కనీసం రెండు పథకాలకు బటన్ నొక్కి సిఎం జగన్ నిధులు జమ చేస్తున్నారు. గతంలో తెలుగు దేశం పార్టీ కూడా నగదు బదిలీ పథకాలు అమలుచేసింది. అయితే ఈసారి రాబోయే ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని మ్యానిఫెస్టోలో ఉచితాలను గుమ్మరించేందుకు సన్నాహాలు చేస్తోంది. మహిళలకు, యువతకు, నిరుద్యోగులకు నేరుగా నగదు పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేశారు. మరిన్ని ఉచితాలు, ప్రోత్సహకాలు ఉంటాయని ప్రకటన కూడా వెలువడింది. ఉచితాల వల్ల అనేక వ్యవస్థలు దెబ్బతింటాయి. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాలు ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. ఏపీలో పెట్రోలు, నాన్ బ్రాండెడ్ లిక్కర్ అమ్మకాలతో ఖజానాకు డబ్బు సమకూర్చుకునే ప్రయత్నం జరుగుతోంది. ఇతర రాష్ట్రాల కంటే ఇక్కడ పెట్రోలు, డీజిల్ ధరలు అధికంగా ఉంటున్నాయి. మరో పక్క కేంద్రం నుంచి డబ్బులు అందడమో, లేక అప్పు పుట్టించడమో చేసి ఖర్చుల నుంచి గట్టెక్కే పరిస్థితి ఉంది. తెలంగాణ ఏర్పడినప్పుడు ధనిక రాష్ట్రంగా ఉండగా ప్రస్తుతం ఇక్కడ కూడా అప్పులపై ఆధార పడి పాలన సాగించాల్సిన పరిస్థితి ఉంది. అయితే ఏపీతో పోలిస్తే ఆర్థిక పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. కర్ణాటకలో కాంగ్రెస్, బిజెపిలు ప్రవేశపెట్టిన ఉచితాలు ఇక్కడ కూడా అమలుచేస్తే అందుకు అనుగుణంగా బిఆర్ఎస్ కూడా మరిన్ని ఉచితాలు అందించేందుకు ముందుకు వచ్చే అవకాశం ఉంది. దీనితో ఏ ప్రభుత్వం వచ్చినా నగదు బదిలీలు, ఉచితాలతో ప్రభుత్వ ఖజానాకు మరింత ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుంది. ఉచితాలకు, నగదు బదిలీకి ప్రత్యేక నిధులు ఎక్కడి నుంచి వచ్చేవి కావు. అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయాల్సిన మొత్తాలు ఉచితాలకు మళ్లిస్తారు. దీనివల్ల వివిధ వ్యవస్థల నిర్వీర్యం అవుతాయి. ఉదాహరణకు పాఠశాలల భవన నిర్మాణాలు, నిర్వహణ, ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ వంటి వాటికి ఖర్చు చేయాల్సిన మొత్తాలను విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మళ్లిస్తారు. దీనివల్ల భవిష్యత్తులో విద్యావ్యవస్థ చిన్నాభిన్నం అవుతుంది. కార్పొరేట్ సంస్థలు రంగంలో దిగి విద్యా వ్యవస్థను వ్యాపారంగా మార్చి వేస్తారు. ఇప్పటికే ఇలాంటి పరిస్థితులు కొనసాగుతున్నాయి. భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొవలసి ఉంటుంది. తెలుగు రాష్ట్రాలు వ్యవసాయాధారిత ప్రాంతాలు. వ్యవసాయంలో ఎక్కువ శాతం ఉండేది కౌలు రైతులు మాత్రమే. అయితే ప్రభుత్వం ఇచ్చే సహాయం మాత్రం భూమి కలిగి ఉన్న బడా బాబులకు అందుతాయి. ప్రభుత్వ వైఖరి వల్ల కౌలు రైతులు నష్టాలు, కష్టాలు ఎదుర్కొని క్రమంగా వేరే ఉపాధి మార్గాల వైపు దృష్టి మళ్లించే అవకాశం ఉంది. దీనివల్ల క్రమంగా వ్యవసాయం దెబ్బతినడం ప్రారంభిస్తుంది. ఇప్పటికే రైతుల బిడ్డలు వ్యవసాయం వైపు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ ఉచిత పథకాల వల్ల వారి తల్లిదండ్రులు కూడా వ్యవసాయానికి దూరమైతే ఆప్రభావం మొత్తం దేశ ఆర్థిక పరిస్థితిపై చూపించే అవకాశం ఉంది. దీని వల్ల ప్రజల్లో పనిపట్ల ఆసక్తి తగ్గుతుంది. నెలానెలా డబ్బు అందుతూ ఉండటంతో ఉపాధిని వెతుక్కోరు. దీనివల్ల వ్యవస్థలన్ని నిర్వీర్యంగా మారే ప్రమాదం ఉంటుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# ఊపిరికి ఉరి కాలుష్యం

కవర్ స్టోరీ

**సుంకవల్లి సత్తిరాజు**

**ఒకప్పుడు ఈ భూ ప్రపంచం పర్యావరణం కాలుష్యరహితంగా ఉండేవి. మదికి హాయిగొలిపే చల్లని గాలులతో, ఆహ్లాదకరమైన సహజసిద్ధమైన వాతావరణంలో, చక్కని పండువెన్నెలలో ఆరు బయట అందరూ కబుర్లు చెప్పుకుంటూ నిదురించిన అలనాటి కాలం గతించింది.**

పెద్దలు చెప్పే కథలు వింటూ ప్రశాంతంగా నిద్దురలోకి జారిపోయి, వేకువజామున కోడికూతతో నిద్రమత్తు వదిలించుకుని, రెట్టించిన ఉత్సాహంతో పగలంతా పనిపాటలు చేసుకుంటూ శ్రమైక జీవన సమిష్ఠితత్వంలో అంతర్లీనంగా ఇమిడి వున్న మానసిక సౌందర్యంతో అరమరికలు లేని స్వచ్ఛమైన మనసులతో ఆరోగ్యంగా శత వసంతాలు జీవించి, పరిపూర్ణమైన సంతృప్తితో ఆనందమయ జీవితం గడిపి హాయిగా తనువు చాలించిన నాటి రోజులు నేడు కరువయ్యాయి.

పక్షుల కిలకిల రావాలతో, పచ్చి బయళ్లలో చెంగున ఎగిరే లేగదూడల గంతుల తో, పాలిచ్చే గోవులు తమ అందమైన దూడలను తమ నోటి స్పర్శతో ఆత్మీయంగా అపురూపంగా తాకుతూ, ప్రకృతి శోభను ఇనుమడించే అపురూప దృశ్యాలు, సూర్యోదయపు కాంతులు చెట్ల చిగురాలకుపై నున్న మంచు బిందువులను తాకి మిలమిల మెరుస్తూ, ప్రకృతి అందచందాలను ద్విగుణీకృతం చేసే కమనీయ దృశ్యాలను వీక్షించే అదృష్టానికి, ఆసక్తికి ఆస్వాదనకు వర్తమాన తరం బహు దూరంలో ఉంది.

ప్రకృతి ఆరాధన తెలియని రోజులొచ్చాయి. ప్రకృతి పట్ల పూజ్య భావం నశించిం ది. పుడమి గర్భాన్ని చీల్చి, సహజ వనరులను వెలికితీసి, విచ్చలవిడిగా వినియోగిస్తూ, కాలుష్యాన్ని పెంచేస్తూ, పర్యావర ణాన్ని నాశనం చేసి, రాబోయే తరాలకు శాపగ్రస్తమైన జీవితాలను అందించడం భావ్యమా?

పర్యావరణాన్ని మనం చేజేతులా నాశనం చేస్తున్నాం. తత్ఫలితాన్ని కూడా అనుభవిస్తున్నాం. భౌగోళిక స్థితిగతులను బట్టి, పర్యావరణ సంబంధమైన మౌలిక పరిశీలనను బట్టి ఏయే కాలాల్లో వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయో కూలంకషంగా అధ్యయనం చేసి కాల విభజన చేయడం జరిగింది. ఆయా మాసాల్లో వచ్చే ఋతువుల్లో వాతావరణ మార్పులు మన పెద్దలు చెప్పిన ప్రకారంగా తూచా తప్పకుండా జరిగేవి. ఖగోళ శాపాన్ని భూగోళ పరిస్థితులను సమన్వ యపరచి, తమ శాస్త్ర విజ్ఞానాన్ని రంగరించి ఏయే ఋతువుల్లో ఏయే మార్పులు సంభవిస్తాయి? ఏ కాలంలో భూతలంపై ఎలాంటి శీతోష్ణ స్థితులు సంతరించుకుంటాయో తెలిపే పంచాంగంలోని విషయాలు యథాతథంగా జరిగేవి. ఏయే మాసాల్లో ఎండలు ఉంటాయి? ఏ కాలంలో చలి పెరుగుతుంది? ఏయే కాలాల్లో వర్షాల ఆగమనం జరుగు తుంది? కార్తెల ప్రభావం ఎలా ఉంటుంది? అనే విషయాలపై మన పెద్దలు చెప్పిన విష యాలు వివిధ వర్గాల ప్రజలకు మార్గ నిర్దేశనం చేసేవి. అయితే నేడు ఆ పరిస్థితులు మారిపోయాయి. మనుషులు మారతారు. కాలాలు, ఋతువులు మారబోవని మన పెద్దలు చెప్పిన మాటలు వర్తమానంలో ఎదురు తిరిగాయి. మనుషులతో పాటుగా కాలాలు కూడా మారిపోయాయి. ఋతువుల ధర్మం మారిపోయింది. కార్తెలు కూడా తమ గమనాన్ని మార్చుకుంటున్న సూచనలు కనిపిస్తున్నా యి. గత కాలం నాటి అంచనాలు తలకిందులవుతున్నాయి. ఒకప్పటి పచ్చని ప్రకృతి, పర్యావరణం మానవ దుష్కార్యాలతో విధ్వంసం కాబడింది. గలగల పారే సెలయేర్లు, నిండు కుండలా జలసిరులతో తులతూగే నదీనదాలు, ఎత్తైన కొండలు, అరణ్యాలు, అరణ్యాల్లో జీవించే పశుపక్ష్యాదులు, అపారమైన భూగర్భ జల సంపద, భూగర్భంలో నిక్షిప్తమైన అమూల్యమైన పలు వనరులు, సకల జీవరాశుల ఉనికికి ఆవాసంగా మారిన పుడమి ప్రకృతి ప్రసాదించిన అందచందాలతో సృష్టి అలంకారం లా భాసిస్తూ, అలరారిన నాటి సోయగం నేడు అదృశ్యమై నిస్సారమై ఎడారిని తలపిస్తున్నది. కొండల్లో, కోనల్లో, అడవుల్లో ఎక్కడ చూసినా ప్రకృతి సోయగం గుబాళించేది. ఎన్నో రకాల వృక్షాలు ప్రకృతిలో పచ్చదనాన్ని సృష్టికి కానుకగా అందించేవి. అలాంటి పచ్చదనం నేడు కనుమరుగైంది. సంగీత రస ఝరిలా పృథ్విపై ప్రవహించే జల రాశులు మటుమాయమైపోతున్నాయి. భూగర్భ వనరులన్నీ తరిగిపోతూ నిండు గర్భిణిలా కనిపించే భూమాత శోకదేవతలా తల్లడిల్లిపోతున్నది. అరణ్యాలు అంతరించిపోతున్నాయి.

కోటానుకోట్ల జీవరాశులకు నిలయమైన అవనిపై మానవాధిపత్యం పెరిగింది.

### క్షీణిస్తోన్న పచ్చదనం

ప్రకృతిలో పచ్చదనం హరించుకుపోతున్నది. పుడమి బోసిపోతున్నది. ఎన్నో జీవరాశులు అంతరించిపోయాయి. మరెన్నో జీవజాతుల ఉనికి ప్రశ్నార్థకమైపోయింది. పర్యావరణం ప్రమాదంలో పడింది.

ఈ సమస్త సృష్టి ఒక మహా విస్ఫోటనం వలన జరిగిందని శాస్త్రవేత్తల భావన. 'బిగ్ బ్యాంగ్ థియరీ'ని భూగోళం ఏర్పడడానికి గల కారణాలను సోదాహరణంగా విశదీకరిస్తున్నది. భూమి ఏర్పడిన తర్వాత నీరు ఏర్పడిందని, ఆ తర్వాత జీవజాలం ఉద్భవించిందని పలువురి వాదన. అయితే భూగ్రహం ఏర్పడడానికి గల కారణాలు ఈనాటికీ ఒక రహస్యంగానే ఉన్న మాట నిజం. ఎవరెన్ని చెప్పినా, ఎవరు ఎన్ని రకాలుగా విశ్లేషించినా భూగోళం ఆవిర్భావానికి కొన్ని ఊహలతో, ప్రయోగాలతో, పరిశోధనలతో కూడిన విశ్లేషణలు పూర్తి స్థాయి ఆధారాలను కనుగొనలేకపోయిన మాట వాస్తవం. భగవంతుడే సృష్టికి మూలమని మరికొందరి నమ్మకం.

శాస్త్రీయమైన దృక్పథమే మనం నివసిస్తున్న భూగ్రహం చరిత్రను ప్రస్ఫుటం చేస్తున్నదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ సర్వ జీవరాశుల మనుగడకు ప్రస్తుతమున్న ఏకైక ఆధారం భూమి. ఈ భూగోళం అనేక సజీవ, నిర్జీవ పదార్థాల సమ్మేళనం. భౌతిక, రసాయనిక సమ్మేళనాలతో మిళితమై ఉన్న భూగ్రహం అన్ని గ్రహాల కంటే మిన్న. మనం నివసించే భూమి, గాలి, నీరు, నీటి సమూహాలైన నదులు, సముద్రాలతో నిండి ఉన్నది. కొండలు, లోయలు, అరణ్యాలు తదితరాలతో ఏర్పడిన మనం చుట్టూ ఉన్న ప్రకృతి పలు సహజసిద్ధమైన ఏర్పాట్లకు నిలయం. ఆహ్లాదకరమైన వాతావరణం, జీవించడానికి వీలైన పరిస్థితులతో భూగోళం ఒక జీవ గ్రహంగా భావించబడుతున్నది. ఇతర గ్రహాల్లో లేని అనుకూలమైన పరిస్థితులు భూమిపై ఏర్పాటు చేయబడ్డాయి. సకల జీవరాశుల మనుగడకు ఆధారమైన అన్ని సదుపాయాలు భూగ్రహంపై ఉన్నాయి. జీవరాశుల మనుగడకు ఎన్నో అవసరాలుంటాయి. అయితే ఇవన్నీ సహజసిద్ధంగా ప్రకృతిలోనే ఏర్పాటు చేయబడ్డాయి. గాలి, నీరు వంటి అత్యవసరాలతో పాటుగా అనేక సజీవ, నిర్జీవ వ్యవస్థలను మన ప్రకృతి మనకు అందించింది. ఎన్నో ప్రకృతిసిద్ధమైన భౌతిక, రసాయనిక వ్యవస్థలు, జీవమున్న, జీవం లేని పదార్థాలు మన చుట్టూ ఆవరించి ఉన్నాయి. మన చుట్టూ ఆవరించబడిన సహజమైన ఈ అద్భుతమైన ఏర్పాటునే 'పర్యావరణం' అని క్లుప్తంగా నిర్వచించవచ్చు. నేషనల్ జియోగ్రాఫిక్ సొసైటీ నిర్వచనం ప్రకారం మొక్కలు, జంతువులు, ఇతర జీవరాశులు ఈ ప్రకృతిలో కలిసి మెలిసి జీవించే ఒక భౌగోళిక ప్రాంతాన్ని 'ఎకోసిస్టమ్' అంటారు. వివిధ రకాల జీవ, నిర్జీవ కారకాలతో మన చుట్టూ ఆవరించబడి, మన జీవితాన్ని ప్రభావితం చేసే పర్యావరణాన్ని గురించి, దాని పరిరక్షణ ఆవశ్యకత గురించి సమగ్రంగా విశ్లేషించుకుని, పర్యావరణ సంరక్షణకు చేపట్టవలసిన ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ గురించి చర్చించడం వలన ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి సార్థకత చేకూరుతుంది.



గాలి, నీరు, మానవ కోటికి అత్యంత ఆవశ్యకాలు. అలాంటి గాలి, నీరు కలుషితమైపోయి, అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. గాలిలో నాణ్యత తరిగింది. విష వాయువులను పీల్చి, రసాయనాలతో నిండిన ఆహార పదార్థాలను భుజించి, సహజసిద్ధమైన వాతావరణాన్ని నాశనం చేసి, కృత్రిమమైన అలవాట్లకు లోనైన మానవ జీవితం అస్తవ్యస్తంగా మారింది. కాలుష్యమనే సాలెగూడు లాంటి ప్రపంచంలో అంటురోగాలతో నిరంతరం చస్తూ, బతుకుతూ అతలాకుతలమౌతున్న మానవాళి ఇలా ఎన్నాళ్లు మనుగడ సాగించగలదు?

ప్రభుత్వాలు, ప్రజలు, అంతర్జాతీయ సంస్థలు ఎందుకు ఈ విషయంలో ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నాయి? పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ నిషేధం ఎందుకు సాధ్యం కావడం లేదు? ప్రపంచంలో ప్రతీ ఏటా 400 మిలియన్ల టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి జరుగుతున్నది. ఇందులో సగం ప్లాస్టిక్ కేవలం ఒకే ఒక్కసారి వినియోగం(సింగిల్ యూజ్) కోసం తయారు చేయబడుతున్నది. ప్లాస్టిక్ వ్యర్థాల వలన పర్యావరణానికి ఏర్పడుతున్న ముప్పును ఎందుకు ప్రభుత్వాలు తీవ్రంగా పరిగణించడం లేదు? కాలుష్యం వెదజల్లే పరిశ్రమలకు అనుమతులిచ్చేదెవరు? రసాయనాల తయారీకి లైసెన్సులు మంజూరు చేసేదెవరు? ప్లాస్టిక్ ఉత్పత్తులకు అనుమతులిస్తున్నదెవరు? వాతావరణ కాలుష్యానికి బాధ్యత ఎవరు? నగరాలు మురికి కూపాలుగా మార్చమని కోరిందెవరు? భూతాపం పెరగడానికి బాధ్యులెవరు? వీటన్నింటికీ ప్రజలు ప్రత్యక్ష కారణం కాదు. పలు దేశాలు తమ వ్యాపార సౌధాలు నిర్మించుకోవడానికి ఇతర దేశాలపై తమ అభిప్రాయాలను, ప్రణాళికలను బలవంతంగా రుద్దే ప్రయత్నంలో ప్రజలను పావులుగా మారుస్తున్నాయి. అధిక దిగుబడుల కోసం రసాయనాలను, పురుగు మందుల వాడకాన్ని ప్రోత్సహించిందెవరు? ప్రజలా? రైతులా? వినియోగదారులా? వీరెవరూ కారణం కాదు. ప్రజలను కాలుష్యపు రొంపిలోకి దించి, పనికిమాలిన ఉత్పత్తులకు అనుమతులిప్పించి, ప్రతీ విషయాన్ని ప్రజలదే తప్పు అన్నట్టుగా మాట్లాడడం సబబు కాదు.

అన్ని దేశాలు అభివృద్ధి పేరుతో, వ్యాపారం పేరుతో పలు రకాల వస్తువులను ప్రజలపై ఆకర్షణీయ మైన పద్ధతిలో చొప్పించి, తీరా వాటి వలన దుష్పరిణామాలు ఏర్పడేసరికి ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరడం భావ్యమా? తర్వాత తీరిగ్గా పర్యావరణంపై అవగాహన కలిగించాలని కోరడం న్యాయమా? ఈ తప్పెవరిది? శిక్షెవరికి? శతాబ్దాల కిందట అత్యంత సౌకర్యవం తంగా, పచ్చదనంతో, పలు జీవరాశుల ఉనికితో, కాలుష్యం లేని చక్కని వాతావర ణంతో ఆహ్లాదకరంగా అగుపించిన ధరిత్రి ఇప్పుడు పర్యావర విధ్వంసం వలన ఏర్పడిన కాలుష్యంతో కళ తప్పి, పచ్చదనం కోల్పోయింది. అనేక జీవరాశుల అంతర్ధానానికి పర్యావరణంలో చోటు చేసుకుంటున్న తీవ్రమైన పరిణామాలే

కారణం. మానవ స్వార్థం పడగ విప్పి బుసలు కొడుతున్నది. భూగోళం నిర్జీవమయ్యే పరిస్థితులు దాపురిస్తున్నాయి. మన కంటిని మన వేలితోనే పొడుచుకునే దుర్దినాలు దాపురిస్తున్నాయి.

ఒకానొక మహా విస్ఫోటనంలో ఉద్భవించి నట్టుగా భావిస్తున్న ఈ మహా విశ్వంలో భూమండలం ఒక మహా అద్భుతం. ఇలాంటి భూమిని కలుషితాలతో నింపి కాటికి పోయే కాలాన్ని చేజేతులా కొనితెచ్చుకోవడం మహా అజ్ఞానం. సకల జీవరాశులకు నివాసయోగ్యమైన 'ధరిత్రి'ని సంరక్షించుకోవడంలో నేటికీ సరైన కార్యాచరణ లేదు. చెప్పడానికి, రాయడానికి మాత్రమే మన ఆలోనా పరిధి పరిమితమైపోయింది. ఆచరణ అటకెక్కింది. భూమిని గురించి, భూ సంరక్షణ గురించి ఆలోచించి, తమ ఆలోచనలను ఆచరణలో పెట్టి ప్రజాభిమానం చూరగొంటున్న ప్రకృతి ప్రేమికులను, పర్యావరణ పరిరక్షకులను గుర్తించి గౌరవించాలి. అత్యంత సాధారణ జీవితం గడుపుతూ ప్రకృతి ప్రేమికుడై, పచ్చదనం కోసం పరిశ్రమించి, అసాధ్యాన్ని సుసాధ్యం చేసి, అరణ్యాన్నే సృష్టించి మానవాళికే కాకుండా ఎన్నో జీవరాశుల ఉనికికి ప్రాణం పోసిన జాదవ్ పాయెంగ్ 'ఫారెస్ట్ మేన్ ఆఫ్ ఇండియా'గా గుర్తింపబడి, ఎన్నో అవార్డులను గెలుచుకుని ఎంతోమంది పర్యావరణ ప్రేమికులకు ఆదర్శంగా నిలిచాడు. తెలంగాణకు చెందిన దరిపల్లి రామయ్య పర్యావరణ పరిరక్షణ కోసం ఎన్నో మొక్కలను పెంచి, ప్రకృతికి కానుకగా అందించి, 'పద్మశ్రీ' అవార్డు అందుకున్నాడు. ఇలా ఎంతో మంది పర్యావరణ ప్రేమికులు పచ్చదనాన్ని పెంచి, ధరిత్రిని కాపాడడానికి కృషి చేస్తున్నారు. ఎన్నో అద్భుతాలు, ఎన్నో సహజసిద్ధమైన అందచందాలు, మనసును మైమరపించే కమనీయ ప్రకృతి దృశ్యాలు ధరిత్రికి అత్యంత శోభను సమకూర్చి పెట్టాయి. మానవ జీవన సౌందర్యం మసకబారే రోజులు ఏర్పడుతున్నాయి. మానవ స్వార్థం మానవాళికే మృత్యుగీతం ఆలపించే తరుణం ఆసన్నమైనది. పచ్చని ప్రకృతి ఒడిలో పసిపిల్లలవలె ఆనందంతో జీవించే ఆరోగ్యవంతమైన వాతావరణం భూమిపై కనుమరుగైపోతుంటే, సహజత్వంలో ఉన్న మాధుర్యాన్ని మరచి, కృత్రిమంగా జీవించే కాలాన్ని ఖరీదు పెట్టి కొనుక్కునే చేటు కాలం దాపురించింది. పండువెన్నెల్లో పరవశించే కాలం పరిసమాప్తమై, కాంక్రీటు అరణ్యాల పరదాల్లో నివసిస్తున్నాం. జీవరాశుల మనుగడకు గ్రీన్‌హౌస్ వాయువులు ఎంత ముఖ్యమో, వీటి ప్రభావం అధికమైతే అంతే ప్రమాదం. గ్రీన్‌హౌస్ వాయువులు లేకపోతే భూతల ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీకి పడిపోతాయి. కాబట్టి ఈ వాయువులు తగిన పరిమాణంలో ఉండాలి. కాలుష్యాన్ని పెంచే ఇంధనాల వాడకం విపరీతంగా పెరిగిపోతున్నది. మానవ దుశ్చర్యల వలన ప్రకృతి ప్రకోపిస్తున్నది. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్నది. కలుషిత కారకాలతో, అవాంఛనీయ వాతావరణ మార్పులతో ధరిత్రిలో జీవజాలం నశించి, భూగ్రహం



నిర్జీవంగా మారే ప్రమాదం ఏర్పడింది. పచ్చదనాన్ని పెంపొందించి, జీవ వైవిధ్యాన్ని కాపాడి, ప్రకృతిని పరిరక్షించి, 'ధరిత్రి'ని కాపాడు కోవడానికి గల అన్ని అవకాశాలను పరిశీలించాలి. ప్రకృతిలో పచ్చదనానికి ప్రాధాన్యతనివ్వాలి. మొక్కలను విరివిగా పెంచాలి. కాలుష్య రహిత ప్రపంచానికి పచ్చదనమే మార్గం. పచ్చదనాన్ని కాపాడితే వాతావరణంలో సంభవించే అవాంఛనీయ మార్పులను అరికట్టవచ్చు. కాలుష్య భూతాన్ని తరిమికొట్టాలంటే పచ్చదనమే ఏకైక మార్గం. సకల దుర్గం ధాలతో మిళితమైన ప్రస్తుత వాతావరణా న్ని మార్చగలమా? మానవ తప్పిదాలను సరిదిద్దుకోగలమా? సహజ జీవన శైలిని అలవరచుకోవడం సాధ్యమేనా? ఈ ప్రశ్నకు జవాబేది?

**పర్యావరణ దినోత్సవం**

పర్యావరణానికి ఏర్పడుతున్న ముప్పును గమనించి, 1972వ సంవత్సరంలో స్వీడన్ రాజధాని స్టాక్ హోంలో జరిగిన ఒక సదస్సులో పర్యావరణ ప్రాముఖ్యతను గుర్తించి, ఐక్యరాజ్యసమితి ప్రతీ ఏటా జూన్ 5వ తేదీన "ప్రపంచ పర్యావరణ దినోత్సవం" జరపాలని నిర్ణయించింది. 1973వ సంవత్సరంలో జెనీవాలో మొట్టమొదటిసారిగా ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరిగింది. పర్యావరణం పట్ల అవగాహన కల్పించడం, పర్యావరణాన్ని పరిరక్షించుకోలేకపోతే జరిగే అనర్థాల గురించి ప్రపంచ దేశాలను అప్రమత్తం చేయడం, పర్యావరణ విధ్వంసాన్ని నిలుపుదల చేసి, కాలుష్యాన్ని అరికట్టి భావితరాలను కాపాడడం 'యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్ ప్రోగ్రామ్' (యుఎన్ఇపి) లక్ష్యం. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి పశ్చిమ ఆఫ్రికాలోని 'కోటె ది ఐవొరె' అనే దేశం (ఐవరీ కోస్ట్) ఆథ్యమిస్తు న్నది. నెదర్లాండ్ భాగస్వామ్యంతో ఈ సంవత్సరపు ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రపంచ పర్యావరణ 50వ వార్షికోత్సవ సందర్భం గా తీసుకునే నిర్ణయాల వలన పర్యావరణానికి మేలు జరగాలి. అలాగే ప్లాస్టిక్ వినియోగం వలన ఏర్పడుతున్న పర్యావరణ ముప్పును నివారించాలనే ఉద్దేశంతో ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం 'సొల్యూషన్స్ ఫర్ ప్లాస్టిక్ పొల్యూషన్' అనే థీమ్ ఆధారంగా ప్లాస్టిక్ నిషేధ ప్రచారానికి శ్రీకారం చుట్టబోవడం విశేషం. ఈ ఏడాది భారతదేశంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ థీమ్ 'మిషన్ లైఫ్'. మనం నిర్దిష్టమైన జీవన పద్ధతుల ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటు పడడమే దీని ఉద్దేశం.ప్రపంచ జనాభా శరవేగంగా పెరుగుతున్నది. పెరిగిన జనాభా పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపెడుతున్నది. భారతదేశం ఇటీవల చైనా జనాభాను అధిగమించి ప్రపంచంలో అతి పెద్ద జనాభా గల దేశంగా అవతరించింది. జనాభా పెరుగుదలతో పాటు పట్టణాలు, నగరాలు కూడా పెరిగిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతవాసులు మెరుగైన ఉపాధి కోసం నగరాలకు వలసపోతున్నారు. నగరాల్లో జనసాంద్రత పెరుగుతున్నది. మురికివాడలు ఏర్పడుతున్నాయి. ఇదే సందర్భంలో ఆకాశ హర్మ్యాలు పెరిగిపోతున్నాయి.

అభివృద్ధి పేరుతో వ్యవసాయ భూములు, చెరువులు, కుంటలు అదృశ్యమౌతున్నాయి. నగరాలన్నీ కాంక్రీటు అరణ్యాలుగా మారుపోతున్నాయి. చినుకుపడితే రోడ్లన్నీ సముద్రాల్లా మారిపోతున్నాయి. డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. వివిధ పరిశ్రమల వలన, అభివృద్ధి పేరుతో జరుగుతున్న కార్యక్రమాల వలన కాలుష్యం పెరిగిపోయి, పర్యావరణం దెబ్బతింటున్నది. నగర జీవనం కలుషిత కారకాలతో కకావికల మౌతున్నది. గత సంవత్సరంలోను, ఈ సంవత్సర ప్రారంభంలోను తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన వర్షాలు కురిసాయి. ఇంతగా వర్షాలు కురిసినా ఈ సంవత్సరం ఏప్రిల్, మేనెలల్లో ఎండలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. ఎంతగా వర్షాలు కురిసినా భూగర్భజలాలు ఆశించిన స్థాయిలో పెరగకపోవడానికీ కారణమేమిటి? బొట్టుబొట్టును పొదుపు చేద్దామనే మాటలు హాస్యాస్పదంగా ఉంటున్నాయి. చెరువుల విధ్వంసం, కాంక్రీటు జనారణ్యాల పెరుగుదల, నీటిని ఒడిసి పట్టే ప్రణాళికలను గాలికి వదిలేయడం వలన పడిన ప్రతీచినుకూ వృథాగా మారిపోతున్నది. అపారమైన జలసంపద కడలి గర్భంలో కలిసిపోతున్నది. భూములు నీరులేక ఎడారులుగా మారిపోతున్నాయి. పర్యావరణ విధ్వంసం వలన వాతావరణంలో అనేక అవాంఛనీయమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అతివృష్టి, అనావృష్టి వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆకాలవర్షాల వలన అనేక నష్టాలు సంభవిస్తున్నాయి. ఒకవైపు వర్షాలు, మరోవైపు విపరీతమైన ఎండలు, ఇంకోవైపు ఆకాశంలో నల్లని మేఘాలు, ఒకవైపు పొగమంచు. మరోవైపు ఉదయాన్నే ఉక్కబోత..ఇలా విభిన్నమైన వాతావరణ వైరుధ్యాలు నెలకొంటున్నాయి. తెలుగురాష్ట్రాలు నిప్పుల కొలిమిలా భగభగమండుతున్నాయి. ఇటీవల రాజమండ్రిలో 49 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాబడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. తెలంగాణలోని పలు ప్రాంతాలు భానుడి తీక్షణవీక్షణకు బెంబేలెత్తిపోయాయి. కొంతకాలం క్రితం విపరీతమైన వర్షాలతో జలప్రళయాన్ని చవిచూసిన హైదరాబాద్ మహానగరం ఈ ఏడాది ఏప్రిల్, మేనెలల్లో ఎండలతో భీతిల్లిపోయింది. కొన్నేళ్ల క్రితం వరకు చెమటపట్టని వాతావరణంతో ఆహ్లాదకరంగా ఉండే భాగ్యనగరం విపరీతమైన ఉష్ణోగ్రతల ప్రభావంతో తల్లడిల్లిపోతున్నది. గతంలో బెంగళూరు నగరం సాయం కాలానికి చల్లని వాతావారణంతో అలరించేది. వాతావరణంలో నెలకొంటున్న కాలుష్యప్రభావం వలన, మానవ తప్పిదాల వలన సంభవిస్తున్న పరిణామాలు, ఉష్ణోగ్రతల్లో పెరుగుదల అంశాలను పరిగణనలోకి తీసుకుని, ఇకనైనా భూగోళాన్ని సజీవంగా నిలుపుకోవాలనే భావన మనందరిలో కలగాలి. గ్రీన్‌హౌస్ వాయువుల వలన భూగోళం వేడెక్కుతున్న కార్బన్‌డైఆక్సైడ్, క్లోరోఫ్లోరో కార్బన్లు, హైడ్రోకార్బన్లలు మిథేన్ తదితర వాయువులను గ్రీన్‌హౌస్ వాయువులు అంటారు. పరిశ్రమల వలన రసాయనాల వ్యర్థాల వలన ప్లాస్టిక్ వినియోగం వలన భూగోళం



పెనుముప్పు ఎదుర్కోవడం జరుగుతున్నది. భూతాపం వలన భారత్ వంటి దేశాలతో పాటు చైనా, బంగ్లాదేశ్ వంటి పలు దేశాలు పలు సమస్యలను ఎదుర్కోబోతున్నాయి. న్యూయార్క్, లండన్, బ్యాంకాక్, ముంబై వంటి అనేక సముద్ర తీరనగరాలకు పెనుముప్పు ఏర్పడబోతున్నది. కోట్లాది సంవత్సరాల క్రితం మహావిస్పోటనం ఫలితంగా భూమి ఏర్పడిందనే వాదన ప్రచారంలో ఉంది. భూమి ముందు ఏర్పడిందా, ఇతర గ్రహాలు ముందు ఏర్పడ్డాయా అనే సందేహానికి ఈనాటికీ స్పష్టమైన సమాధానం దొరకలేదు. భూమికి సంబంధించిన ఎన్నో ప్రశ్నలను ఛేదించడానికి శాస్త్రవేత్తలు నిరంతరం తపిస్తున్నారు. భూమి ఏర్పడిన తర్వాత భూమిపై జీవించడానికి అనేక వనరులు ఏర్పడ్డాయి. దీనితో జీవజాలం ఏర్పడింది. మానవులతో పాటు వివిధ రకాల జీవరాశులు ఉద్భవించి, మనుగడ సాగిస్తున్నాయి. పెరిగిన విలాసవంతమైన జీవనవిధానం ప్రకృతిని విధ్వంసం చేస్తున్నది. నగరజీవనం అస్తవ్యస్తంగా మారింది. అడవులు నశించిపోతున్నాయి. పచ్చదనంతో వికసించిన ప్రకృతి నేడు దీనావస్థను చవిచూస్తున్నది. మానవ జీవనవిధానంలో సహజసిద్ధమైన పద్ధతులు నశించిపోయాయి. విషవాయువుల వలన వాతావరణం కలుషితమైపోయింది. గాలి, నీరు, ఆహారం కలుషితంగా మారింది. మానవ అవసరాల కోసం సృష్టించుకున్న అనేక విధానాలు మానవ విధ్వంసానికి దారితీస్తున్నాయి. పెరిగిన అవసరాలు భూమిపై సహజసిద్ధమైన వాతావరణాన్ని విచ్ఛిన్నం చేసాయి. పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యం, వ్యవసాయరంగంలో వినియోగిస్తున్న రసాయనాలు, పెరిగిన అభివృద్ధి మానవ మనుగడకు ముప్పుగా మారింది. ప్లాస్టిక్ వినియోగం నిత్యజీవితంలో పెనవేసుకుపోయింది. వందల కోట్లటన్నుల ప్లాస్టిక్ భూమిలోను, సముద్రాల్లోను పేరుకుపోయింది. ప్లాస్టిక్ భూమిలో కరగడానికి వేలాది సంవత్సరాల కాలం పడుతుంది. ప్లాస్టిక్ తగలబెట్టడం వలన కాలుష్యం పెరుగుతున్నది. స్వల్ప స్థాయిలో జరుగుతున్న ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ వలన పెద్దగా ప్రయోజనం లేదు. ప్లాస్టిక్ తయారీయూనిట్లను మూసివేయకుండా ప్లాస్టిక్ వాడుతున్న ప్రజలపైన, వ్యాపార సంస్థలపైన కొరడా ఝళిపించడం వలన ప్రయోజనం లేదు. ప్లాస్టిక్ వినియోగం ఇలాగే కొనసాగితే భూగోళం ప్లాస్టిక్ నిలయంగా మారి, అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయి. బొగ్గు, పెట్రోల్, సహవాయువు వంటివి శిలాజ ఇంధనాలు, కార్బన్‌డై ఆక్సైడ్ ప్రధానంగా ఉండే ఇంధనాల వాడకం వలన పర్యావరణం దెబ్బతింటున్నది. వాహనాల్లో వినియోగించే ఇంధనాలు వాతావరణాన్ని నాశనం చేస్తున్నాయి. సహజమైన వనరుల ద్వారా లభ్యమయ్యే ఇంధన వనరులను వినియోగంలోకి తీసుకురావాలి. పునరుత్పాదక ఇంధనశక్తి వినియోగం పెరగాలి. బయోఎనర్జీ, సూర్యరశ్మి, గాలి వలన లభించే శక్తి వనరులను శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా వినియోగించాలి. శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించి కాలుష్యరహితమైన ఇంధనాల వైపు దృష్టిసారించాలి. ఉచితంగా లభించే, కాలుష్యరహితమైన సౌరశక్తి మాత్రమే భవిష్య అవసరాలను తీర్చగలదు.

చైనా 340 మెగావాట్ల సామర్థ్యంతో ప్రపంచంలో అత్యధిక ఉత్పాదక దేశంగా అవతరించింది. చైనా సోలార్ పరికరాల మీద అధిక మొత్తం ఖర్చు చేస్తున్నది. 2025 నాటికి 33 శాతం విద్యుత్‌ను పునరుత్పాదక శక్తి వనరుల నుంచే వినియోగించాలనేది చైనా లక్ష్యం 2030 నాటికి చైనాలో సౌర, పవన ఉత్పత్తిని 1200 మెగావాట్లకి పెంచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అమెరికా సుమారు 103 జి.డబ్ల్యూతో, జపాన్ 78, జర్మనీ 62 జిడబ్ల్యూకి పైగా సౌరసామర్థ్యం కలిగి ఉంది. భారతదేశం ప్రపంచంలో సౌరశక్తిని అధికంగా వినియోగించే దేశాల్లో ఐదవదేశంగా ఎదిగింది. భారతీయ సౌరశక్తి వినియోగం 57మెగావాట్లు. భారతదేశం అత్యధిక సౌరశక్తి సామర్థ్యం గలదేశం. భారతదేశంలో ఏడాదిలో 300 రోజులకుపైగా సూర్యకాంతి లభిస్తుంది. మానవ మేధస్సు కంటే ప్రకృతి అత్యంత బలీయమైనది. ఎన్నో పరిశోధనలు జరిగినా, ఎన్నో ఆవిష్కరణలు జరిగినా ఇప్పటి వరకు మానవుడు మృత్యువును, ప్రకృతిని జయించలేకపోయాడు. రోగానికి వైద్యపరంగా చికిత్స అందించవచ్చు. సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించవచ్చు. కాని ప్రకృతి విలయాలను ఆపడం సాధ్యం కాదు. పెరిగిన సాంకతిక పరిజ్ఞానం వలన ప్రకృతి విపత్తుల వలన సంభవించే ప్రాణనష్టాన్ని, ఆస్తినష్టాన్ని పూర్తిగా నివారించలేకపోయినా కనీసస్థాయికి తగ్గించే అవకాశాలున్నాయి. ప్రకృతి విలయాలను ఆపడం సాధ్యం కాదు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం వలన ప్రకృతి విపత్తుల వలన సంభవించే ప్రాణనష్టాన్ని, ఆస్తినష్టాన్ని పూర్తిగా నివరించలేకపోయినా కనీసస్థాయికి తగ్గించే అవకాశాలున్నాయి. ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడానికి, నష్టాన్ని సాధ్యమైనంత తక్కువస్థాయికి తగ్గించే అవకాశాలున్నాయి. ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడానికి, నష్టాన్ని సాధ్యమైనంత తక్కువస్థాయికి తగ్గించడం కేవలం మన విచక్షణపైనే ఆధారపడి ఉంది. పర్యావరణ పరిరక్షణ వలన చాలావరకు మానవాళి సురక్షితంగా ఉండగలదు. మానవైఫల్యాల వలన, ప్రకృతిలో సంభవించే తీవ్రమైన పరిణామాలను, జననష్టాన్ని కనీసస్థాయికి తగ్గించగలగాలి. ప్రపంచాన్ని ఎలాంటి విపత్తులు లేకుండా కాపాడాలనే మానవ సంకల్పానికి వికల్పమే 'వైపరీత్యం'. ప్రకృతి విపత్తులన్నీ చాలావరకు మానవ తప్పిదాల కారణంగానే సంభవిస్తున్నాయి. వరదలు, భూకంపాలు, తుపానులు, సునామీలు ఇత్యాధులన్నీ సహజ విపత్తులు, ప్రజల ప్రాణాలకు ఆస్తులకు నష్టం కలిగించి, విధ్వంసం చేసి, కోలుకోలేని విధంగా మానవ జీవితాలను అతలాకుతలం చేసిన అనేక సంఘటనలు ఈ ప్రపంచంలో సంభవించాయి. అతివృష్టి వలన వరదలు సంభవించడం, ప్రజాజీవితాన్ని స్తంభింపచేయడం, అనావృష్టి వలన పంటలన్నీ ఎండిపోయి, ఆహారోత్పత్తి దెబ్బతినడం, తాగడానికే నీరులేక కటకట లాడడం మనం చూస్తున్నాం. వీటన్నింటినీ విపత్తులుగా పేర్కొనవచ్చు. జనజీవనానికి తీవ్రవిఘాతం కలిగించి, జీవనోపాధిని దెబ్బతీసి, ప్రాణాలకు, ప్రభుత్వ ఆస్తులకు



నష్టం కలిగించడంలో ప్రకృతి విపత్తుల ప్రభావం అధికం. ప్రకృతి వైపరీత్యాల నుండి కోలుకుని, జనజీవనం సాధారణస్థితికి రావడానికి సుదీర్ఘకాలం పడుతుంది. ఇలాంటి సందర్భాల్లో ప్రజాజీవనాన్ని పునరుద్ధరించడానికి ప్రభుత్వాల, జాతీయ, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థల అవసరం ఎంతైనా ఉంది. మానవ జీవితాలను అతలాకుతలం చేసే ఇలాంటి ప్రమాదాలన్ని సాధారణ స్థాయిని దాటి తీవ్రమైన స్థితికి చేరడం వలన విపరీతమైన ప్రాణనష్టం జరుగుతున్నది. ప్రకృతి వైపరీత్యాల్లో వాతావరణ పర్యావరణ, సంబంధమైన అంశాలు మిళితమై ఉన్నాయి. ప్రస్తుతం ఏర్పడుతున్న వైపరీత్యాల్లో మానవ ప్రేరిత వైపరీత్యాలదే సింహభాగం. ఈ భూప్రపంచంలో మానవ మనుగడ కొనసాగించాలంటే పచ్చదనాన్ని పరిరక్షించుకోవాలి. స్వార్థప్రయోజనాల కోసం చెట్లను నరికే విధానం మారాలి. వృక్షజాతిని పెంపొందించాలి. మొక్కలను నాటే కార్యక్రమాన్ని దైవభక్తి, దేశభక్తితో ముడిపెట్టాలి. అప్పటివరకూ మొక్కలు నాటే కార్యక్రమం ఊపందుకోదు. చెట్లను పెంచడం వలన భూతాపం తగ్గుతుంది. వాయికాలుష్యం తగ్గి మనం పీల్చేగాలిలో నాణ్యతాశతం పెరుగుతుంది. అనారోగ్య సమస్యలు అరికట్టబడుతాయి. వాతావరణం చక్కబడుతుంది. పచ్చని చెట్లను నరకడం వలన వాతావరణ సమతుల్యత దెబ్బతింటున్నది. మానవాళికి అవసరమైన ప్రాణవాయువు లభించడం లేదు. కాలుష్యం పెరిగి, ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. మానవ మనుగడకు రక్షాకవచమైన ఓజోన్ పొర దెబ్బతినడం వలన రేడియోధార్మికత వెలువడుతున్నది. దీని వలన అనేక విపత్కర పరిణామాలు సంభవిస్తున్నాయి. వాతావరణంలో అవాంఛనీయ పరిణామాలకు మనదే బాధ్యత. గ్లోబల్ వార్మింగ్ ఒక విషమసమస్య. ఈ విషమసమస్యకు విరుగుడు కూడా మనచేతుల్లోనే ఉంది. పర్యావరణాన్ని పరిరక్షిస్తే, వాతావరణం మెరుగుపడుతుంది.

భూగ్రహం కూడా విశ్వంలో భాగమే భూగ్రహంపై మూడొంతల నీరు, ఒకవంతు భూమి కలదు. వృక్షాలతో, నదీనదాలతో, కొండలు, లోయలు, సముద్రాలతో పలు జీవరాశులతో విభిన్నమైన భౌగోళిక నైసర్గిక స్వరూపాలతో, పచ్చని ప్రకృతి మధ్య జీవించే మహద్భాగ్యాన్ని మానవుడే చెరిపేస్తున్నాడు. స్వార్థప్రయోజనాల కోసం విచక్షణ కోల్పోయి ప్రకృతిని చెరబట్టి, వికృతంగా మారుస్తున్నాడు. అడవులను నరికి నివాసాలను ఏర్పాటు చేసుకోవడం, పంటభూములను మానవావసరాలకు వినియోగించడం, కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఏర్పాటు చేయడం, శిలాజ ఇంధనాలను ఇబ్బడిముబ్బడిగా వినియోగించడం వలన ధరిత్రిపై కాలుష్యపు క్రీనీడలు కమ్ముకుంటున్నాయి. అడవులను ధ్వంసం చేయడం వలన భూ ఉపరితల ఉష్ణోగ్రత పెరుగుతున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే 2036వ సంవత్సరం నాటికి 'గ్లోబల్ వార్మింగ్' సమస్య పెరిగి భూమిపై మనుగడ సాగిస్తున్న పలు జీవరాశుల భవిష్యత్తు ప్రశ్నార్థకమౌతుంది. పర్యావరణం కాలుష్యంతో నిండిపోయింది. మానవ నివాసయోగ్యం కాని ప్రదేశంగా భూగ్రహం పరివర్తన చెందబోతున్నది. ఇకనైనా మేలుకోవాలి.

**(మిగతా 19వ పేజీలో)**



**కోల్‌కతా-హవ్‌డా** జంట నగరాల్ని చీల్చుకుంటూ వెళుతుంది హుగ్లీ నది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఆ నగరంలో ఒకవైపు నుంచి మరోవైపు వెళ్లాలంటే హుగ్లీ పైన నిర్మించిన హవ్‌డా బ్రిడ్జి, మెట్రో మార్గం ద్వారానే ప్రయాణికులు గంటల తరబడి ప్రయాణించాల్సి ఉంటుంది. దాంతో హుగ్లీ నదీగర్భంలో మెట్రో నిర్మించి ప్రయాణీకుల సమయాన్ని ఆదా చేస్తున్నారు అధికారులు.

☛ దేశంలో మెట్రో సేవల్ని పొందిన తొలి నగరం కోల్‌కతా. తాజాగా నీటి అడుగున మెట్రో రైలు పరుగులతోనూ మరో కొత్త రికార్డును నమోదు చేసింది.

# నది కింద మెట్రో పయనం

☛ ప్రయాణీకుల సమయాన్ని ఆదా చేసి వారి ప్రయాణాన్ని మరింత సౌకర్యంగా మార్చాలనే ఉద్దేశంతోనే అధికారులు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కోల్‌కతాలోని హవ్ డా మైదాన్, ఎస్‌ప్లనేడ్ స్టేషన్ల మధ్య ప్రయాణించాలంటే హుగ్లీ



నదిపైన నిర్మించిన మెట్రో మార్గంలో నలభై ఐదు నిమిషాలు, హవ్‌డా బ్రిడ్జిపైన రోడ్డు మార్గంలో వెళ్లాలంటే గంటన్నర పడుతుంది. కేవలం నది కారణంగా ప్రయాణీకుల సమయం వృథా కావడం గమనించిన అధికారులు ఎలాగైనా ఆ సమయాన్ని కుదించాలనుకున్నారు.

☛ ఈస్ట్-వెస్ట్ మెట్రో కారిడార్‌లో భాగంగా కోల్‌కతా నగరం లోని టెగోరియా స్టేషన్ నుంచి హుగ్లీ నదికి అవతల ఉన్న హవ్‌డామైదాన్ హుగ్లీ నదికి అవతల ఉన్న హవ్‌డా మైదాన్ వరకు కోల్‌కతా మెట్రో లైన్-2 (గ్రీన్‌లైన్) వెళ్తుంది. ఈ మార్గంలో 17 రైల్వేస్టేషన్లు ఉంటే వాటిలో 6 భూగర్భంలో ఉంటాయి. ఈ గ్రీన్‌లైన్ పొడవు 16.6 కిలోమీటర్లు. ఇందులో 10.8 కిలోమీటర్లలైన్ భూగర్భంలో వెళ్తుంది. అందులో భాగంగానే హుగ్లీ నదీ గర్భంలో 520 మీటర్ల పొడవున మెట్రో కారిడార్‌ను నిర్మించారు.

☛ ఈస్ట్-వెస్ట్ మెట్రో కారిడార్‌కు ఫిబ్రవరి 2009లో పునాదిరాళ్లు వేసిన అధికారులు 2014 అక్టోబరు నాటికి ఆ మార్గంలో మెట్రో సేవల్ని అందుబాటులోకి తేవాలనుకున్నారు. కానీ వాతావరణం, భౌగోళిక పరిస్థితులు, జనసాంద్రత కారణంగా కొన్నేళ్లపాటు పనులు ఆగిపోయాయి. సొరంగంలో పనులు చేస్తున్నప్పుడు 2019లో జరిగిన ఓ ప్రమాదం కారణంగా సెంట్రల్ కోల్‌కతాలోని బౌబజార్ ప్రాంతంలో పదుల కొద్దీ భవంతులకు పగుళ్లు వచ్చాయి. కొన్ని పేకమేడల్లా కూలిపోవడంతో మరింత ఆలస్యమైంది. ఈ ఏడాది తొలినాళ్లకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది.

☛ హుగ్లీ నదికి తూర్పు తీరంలో మహాకరణ్ స్టేషన్, పశ్చిమతీరంలో హవ్ డా స్టేషన్ ఉంటాయి. మెట్రోమార్గం కోసం నదీ మట్టానికి 32మీటర్ల లోతులో సొరంగాలను నిర్మించారు. హవ్‌డా మెట్రో స్టేషన్ మాత్రం భూమి ఉపరితలానికి 33 మీటర్ల దిగువన ఉంటుంది. మనదేశంలోని అతిలోతైన భూగర్భ మెట్రోస్టేషన్‌గానూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది. రైలు ట్రాక్ కోసం నిర్మించిన సొరంగాల వైశాల్యం 5.55 మీటర్లు.

☛ కోల్‌కతా మెట్రో లైన్-2లో ఇప్పటికే టెగరియా స్టేషన్ నంచి మొదలయ్యే రైళ్లు సీల్దాస్టేషన్ వరకు నడుస్తున్నాయి. ఏప్రిల్ 12న హవ్‌డా-మహాకరణ్ స్టేషన్ మధ్య అండర్ వాటర్‌లో ట్రయల్ రన్ విజయవంతమైంది. ఇది దేశంలో తొలిసారి నదీగర్భంలో జరిపిన నిర్మాణం కాబట్టి ఇంకొన్నాళ్లు ట్రయల్ రన్స్ జరిపి, ఆ తరువాతే ఈ మార్గాన్ని అందుబాటు లోకి తేనున్నారు. ఆ కాంక్రీట్ రింగులను జత చేసిన చోట నీళ్లు లోపలికి రాకుండా హైడ్రోఫిలిక్ గ్యాస్కెట్ అనే దృఢమైన రబ్బరుతో కాంక్రీటు రింగుల్ని అనుసంధానించారు. దాంతో చుక్క నీరు కూడా సొరంగాల్లోకి వచ్చే అవకాశం ఉండదు. బ్రిటన్‌కు చెందిన ప్రపంచస్థాయి సంస్థలు అట్కిన్స్, సైస్ట్రాలు ఈ ప్రాజెక్టులో భాగస్వాములయ్యాయి. ■





# యాత్రా స్మృతులు

**చలనం** లేని శిల అయినా నింగితో మేమూ
సమానమే అన్నట్టుగా..
అందమైన ఆకారంతో ఎత్తైన కొండలు!
విశ్వాత్మ సృష్టియా! అన్నట్టుగా కొండలని
పచ్చదనంతో అలంకరించిన అందమైన
వృక్షాలు
ధవళ కాంతి తెరగా కప్పబడినట్లుగా
ఆకర్షించే
హిమాలయాలు..



మంచుఝల్లులు, /పొగమంచు అందాలు!
మందాకినీ నది మధుర రాగాలు..
అలకనందా అందాల ఆటలు
గంగమ్మ గల గల సవ్వడులు
సరస్వతీ నది స్వర ఆలాపనతో
జాలువారు జలపాతాలు!/ దేవీ దేవతలు, మహర్షులు,
ఆచార్యులు, / ఋషుల దివ్యక్షేత్రాలు
కాలుష్యం లేని ప్రకృతి/ కల్మషం లేని జనుల
ఆదరాభిమానాలు
మరువలేని మధుర అనుభూతులు
'ఉత్తరాఖండ్' యాత్రా స్మృతులు.

**- ప్రశాంత లక్ష్మి**

# పూసలమ్మ

**నెత్తిన** బుట్ట
బుట్టలో గాజులు, పూసలు
స్త్రీల ముత్తయిదుతనాన్ని మోస్తున్న
పూసలమ్మతల్లీ జోహార్లు!
నడినెత్తిన సూరీడు
కాళ్ల కింద మంటలు
పొట్టకూటికై వీధి వీధి తిరుగుతూ
ఆత్మాభిమానం చంపుకోక
చేయి చాపక చేతులకు గాజులు వేసే
పూసలమ్మతల్లీ! నీకు వందనాలు!!
ఉషోదయాన లేచి/ నిద్రకు సలాం
కొట్టి
కాళ్లు అరుగుతున్నా
చెమటధారలు కడుతున్నా
లెక్కచేయక
జీవితపు లెక్క సరి చేయడానికి
సాగుతున్న పూసలమ్మతల్లీ
వందనాలు/ తనకెవరూ లేకున్నా
తోడెవరూ రాకున్నా..
బిడ్డల కడుపు నింపడానికి
గొంతు ఎడారవుతున్నా
గాజులమ్మా... గాజులమ్మో.. యని
కేకలు పెడుతూ/ గడప గడపకు..
పల్లె పల్లెకూ/
ఐదవతనాన్ని మోసుకెళుతున్న
పూసలమ్మతల్లీ వందనాలు!

**- జి.మధుమురళి**




## ఈవారం కవిత్వం

# చినుకు రవ్వలు

**ఆరోజు** నేను
ఒక్కడినే పార్కులో..
నా లోపలంతా కలియతిరుగుతున్నా
ఎదురుగా ఎండిన చెట్టుపైన
ఏకాంతంగా ఉన్న పక్షి
నన్ను గమనించి నా మౌనంపై వాలింది.
కాలం ఒడ్డున నడిచే ఒక్కో ఆలోచన
నిజాలను పొడిచి పొడిచి
అనుభవాలను ఏరికొచ్చి
రకానికో స్పర్శల అల్లికల
దృశ్యపు గూటిలో
మనసుకి దాచి, అందిస్తుంటే
కట్టు విప్పుకున్న భావాలు
గుట్టు మరచి గెంతులేసి
చిరుచప్పుళ్లతో చిట్టిఅలల ముడి విప్పా
మట్టిముద్దలాంటి బుద్ధిపై
చినుకు రవ్వలు రువ్వితే
చెట్టు, పక్షి సాంగత్యంలో
గొంతు కలిపిన జల్లు మనసంతా కురిసి
దప్పిక తీరే మర్యాదకు మూలం
లోపల ఏదో ఇష్టం ఉండబట్టేగా..

**- చందలూరి నారాయణరావు**


## భక్తితత్వమే మోక్షమార్గం



ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత, తెలుగువిశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్య విరచిత తాజా పద్యకావ్యం 'కైవల్య'. 'దీవెనొసగిన కవితయను నావనెక్కి/ వచ్చుచుంటిని నీవైపు, స్వాగతింప/ రమ్మననుకాని, స్వామి! ద్వారమునొకింతు/ తెరచియుంచుమీ! హృదయమ్ము తెరచిఅట్లె' అంటూ శ్రీవెంకటేశ్వరభక్తి రచనకు ఉపక్రమిస్తారు భూమయ్య. ఈ వేదాంతసూత్ర వికృతికావ్యంలో అంతర్ముఖునుడైన ఒక సాధకుడు విజ్ఞాననౌకను అధిరోహించి సంసారసాగరాన్ని దాటిన వైనాన్ని తెలియజేసే యాత్రచరిత్ర అవగతమవుతుంది. తన ఆరాధ్యదైవం వేంకటేశ్వరుని పట్ల ఒక భాగవద్భక్తుడి ప్రేమానురాగాలు ఎన్ని విధాలుగా వ్యక్తమవుతవో చదివి ఆస్వాదించాల్సిందే. శేషాద్రి, నీలాద్రి గరుడాద్రి, అంజనాద్రి, వృషభాద్రి, నారాయణాద్రి యిలా ఒక్కొక్క మెట్టు అధిరోహిస్తూ అజ్ఞాన పొరలు చేధించుకుని, సంసార సంకెళ్ల తెంపుకుని కైవల్య (మోక్షం) సిద్ధి దిశగా భక్తుడి ప్రస్థానం అత్యంత రమణీయంగా వర్ణించారు కవి. చివరగా వేంకటాద్రి నధిరోహించిన భక్తాగ్రేసరుడు 'ప్రార్థనా ద్వారము దాటి వచ్చినంత/ కంటే విశ్వాంతరాళ/ ముదునేనొక తెల్లని హంసనగుట' అంటే కైవల్యానికి ప్రతిబంధకాలైన కోర్కెలను జయించిన తాను 'హంస'నని గుర్తిస్తూ ముక్తాయిస్తారు. దైవభక్తులకు, మరీముఖ్యంగా పద్యప్రియులకు అనుమాండ్ల భూమయ్య అందిస్తున్న అపురూప కానుక యిది.

**(కైవల్య, రచన: ఆచార్య అనుమాండ్ల భూమయ్య, వెల: రూ 80, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచిగూడక్రాస్‌రోడ్, హైదరాబాద్)** **- రమణ వెలమకన్ని**

## గిరిపుత్రుల జీవిత చిత్రణ



పుస్తకం శీర్షిక 'సదువు చెబుతవ సారూ' చేతిలోకి తీసుకోగానే పాఠకుడిలో ఉత్కంఠ రేపుతుంది. గుడిపాటి ముందుమాట 'చదువు విలువని తెలియజెప్పే నవల' శీర్షిక చదవగానే పాఠకుడికి మరింత దగ్గరవుతుంది. అలా అలా తిరగేస్తుంటేనే ఈ 98 పేజీల నవల పూర్తి అయి, తెలియకుండానే పాఠకుడు రచయిత వైబోయిన సత్యనారాయణ ఆత్మీయుడైపోతాడు. కథ, కథనం రెండూ సామాన్యం అయినా, రచయిత నవలను నడిపించిన తీరు 'అసామాన్యం'. నవలలోని ముఖ్యపాత్రలు పైడాకులమడుగు అనే గిరిజన గ్రామపు సింగిల్ టీచర్ సత్యం. కౌమారంలో ప్రవేశించి సత్యం మాష్టారిమీద ప్రేమ పెంచుకున్న శిష్యురాలు వెన్నెల. ఇద్దరి మధ్యా జరిగిన పెళ్లితంతు లోకం మెచ్చుతుందో లేదో కాని వారిది అలౌకికమైన ప్రేమ. వెన్నెల ఉన్నతికొరకు తనకుతానే కరిగిపోయిన సత్యం మాష్టారు. అందనంత ఎత్తుకు వెన్నెల ఎదిగినా, మేష్టారు చేసిన మేలు మరువకుండా, పటంకట్టి నిత్యమూ మొక్కేవెన్నెల ఈ రెండు పాత్రలను ఎంతో ఔచిత్యమంతంగా అక్షరీకరించారు రచయిత. నవలలో కనిపించే మూడు ప్రత్యేకతలను ప్రముఖ విమర్శకులు పత్రికాధిపతి గుడిపాటి (పేజీ 11) వివరించిన తీరు అద్భుతం. నేటికీ ఆ గిరిజన పల్లెల్లో ఇంకా, అలాంటి పరిస్థితులే, పెద్దమార్పు లేకుండా ఉండటం శోచనీయం. సత్యం వెన్నెలలు తిరిగి కలుసుకోవడంతో నవల ముగుస్తుంది. **(సదువు చెబుతవ సారూ, రచన: వైబోయిన సత్యనారాయణ, వెల: రూ100, ప్రతులకు: పాటపిట్ట బుక్‌హౌస్)**

**- కూర చిదంబరం**

**పుస్తక సమీక్ష**

తెలుగునవల పుట్టి శతాబ్దన్నర దాటింది. చరిత్రకు, సాంఘిక, రొమాంటిక్, డిటెక్టివ్ ఇలా పలు విభాగాలుగా నవలలు తెలుగుపాఠకుల్ని ఉర్రూత లూగించాయి. మానలాక్షణికులు నవలలో నవరసాలతోపాటు అష్టాదశ వర్ణనలుండాలి అన్నారు. హద్దులేని కావ్యప్రపంచంలో కవి బ్రహ్మలాంటి వాడు..ఆపారే కావ్య సంసారే కవిరేవప్రజాపతి' అన్నారు. ఆనంద వర్ధనుడు, బాణభట్టు


## ఊహల 'పూలబాటలో'



'కాదంబరి' నవల భారత సాహిత్యంలో తొలినవల అంటారు ఆంగ్లంలో నావల్, కన్నడంలో కాదంబరీ, హిందీలో ఉపన్యాస్ అంటారు నవలలను. 'మానవ జీవిత రహస్యాలను విప్పి చెప్పేందుకు నవలారూపమే ఉత్తమ సాధనము' అంటారు ప్రేమ్‌చంద్. ఈ నవలలో బాగా ప్రాచుర్యం గల పాత్రలు సుబ్బరాజు, ఉషారాణి గురుప్రసాద్‌జీ అనే మూడు పాత్రలలో (కథానాయకీ-కథానాయకుడు) ఆసాంతం చదివించేలా రచయిత నవల నడిపించారు. పాత్రలు తమదైన అస్తిత్వాన్ని నిలబెట్టుకొంటూ మానవ జీవన సౌందర్యం చూపాయి. బ్రతుకు తెరువుకోసం పట్నం వచ్చిన నిరుద్యోగి సుబ్బరాజు గ్యాంగ్‌స్టర్ బెన్నీ (బెనర్జీ), దగ్గర చేరడం అతని ప్రియురాలు భార్య దేవయాని, వీరితో గురుజీ సహచర్యం, ఆయన కు'సుమాల'తో సాన్నిహిత్యం తాతను భూకబ్జాదారుల నుండి రక్షించడం చక్రధర్ లాంటి పొలిటీషియన్ పాత్ర మధ్యలో ప్రవేశం..సుబ్బరాజు, ఉషల ప్రేమ చివరికి వారిద్దరి పెళ్లితో సుఖాంతం అవుతుంది. **(పూలబాటలో, రచన: ప్రభుచంద్ర, వెల: రూ 150, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచీగూడ, హైదరాబాద్)** **- తంగిరాల చక్రవర్తి**

డాక్టర్.ఎమ్.సుగుణరావు, 'ఆకాశంలో ఒక నక్షత్రం' కథాసంపుటిలో, మానవీయ జీవితస్పర్శతో మన చుట్టూ వున్న సమాజంలోని మనుషులను పలకరిస్తూ, మన హృదయాలను కదిలిస్తారు. ఒక విషాద సంఘటన ఆధారంగా 'తొహిరో' కథానిర్మాణం, ప్రస్తుత సామాజిక అణచివేత, దళిత

## మానవ సమస్యలపై సమగ్ర విశ్లేషణ



జీవనవేదనను కన్నీళ్లు కట్టిస్తుంది. 'క్షమాభిక్ష'లో ఘోర నేరం సృష్టించి, నిరపరాధికి శిక్ష విధించడం రచయిత కథాసృజనా కౌశల్యాన్ని కథ నడిపిస్తుంది. రాయలసీమ పల్లెల నీటి సమస్య 'రెయిన్ డేన్స్' విలాస వినోదం స్ఫురింపచేస్తుంది. జీవజాతి కథలు అంతరించిపోతున్న జీవజాతులలో, మానవులు కూడా ఎలా విపత్కరతను ఎదుర్కోవలసి వస్తుందో స్పష్టం చేస్తుంది. వాస్తవాలను మనుషుల వ్యవహారసరళి, వ్యవస్థీకృత వివక్షపై ప్రశ్నించే తత్వానికి వైవిధ్యపూరిత భూమికల సృష్టించుకొని, హృదయాలను స్పృశించేలా ఆలోచింపచేసే కథలను డా॥సుగుణారావు ప్రతిభావంతంగా సృష్టించారు. అంటరాని తనం వంటి దురాచారం బాల్యస్నేహ ఆత్మీయతగా 'దేవుడే దిగివచ్చాడు వంటి చక్కటి కథలు, ప్రతీకథలో యితివృత్తం వైవిధ్యంతో రచయిత చక్కటి మలుపులతో నడిపించారు. దళితవాదం, స్త్రీవాదం హింస అన్యాయ అణచివేతలకు గురిఅయిన వారి వ్యధ కథలలో రచయిత ప్రతిభావంతంగా ప్రతిబింబింపచేసారు. **(ఆకాశంలో ఒక నక్షత్రం, రచన: డాక్టర్ ఎమ్.సుగుణరావు, వెల: రూ 200, ప్రతులకు: నవోదయ, నవతెలంగాణ, ప్రజాశక్తి బుక్‌హౌస్‌లు)** **- యర్రమిల్లి**



# ఇవి కూరగాయల మాత్రలు

**బీట్‌రూట్,** క్యారెట్‌ను రోజూ చేసుకోవడానికి ఎవరూ పెద్దగా ఇష్టపడరు. తరచూ ఆకుకూరల్ని తింటే మంచిదని డాక్టర్లు ఎంత చెప్పినా..వండుకునేవారి సంఖ్య తక్కువే. చేదు పేరుతో కాకరకాయను దూరం పెట్టేస్తుంటారు చాలా మంది. ఇవన్నీ గుర్తించారో ఏమో ఇప్పుడు చాలారకాల కూరగాయలను మాత్రల రూపంలో తయారుచేసి అప్పుడప్పుడూ వీటిని వేసుకుంటే సరి..అంటూ పరిష్కారాన్ని చూపించేస్తున్నారు నిపుణులు. వారానికి సరిపడా తెచ్చుకునే కూరగాయల్లో వంకాయలూ, బెండకాయల నుంచి టొమాటోలూ, ఆకుకూరల వరకూ అన్నీ ఉంటాయి. జ్యూస్ చేసుకుందామని బీట్‌రూట్-క్యారెట్ తెచ్చుకున్నా వాటి చెక్కుతీసి, ముక్కలు కోసం, మిక్సీ పట్టి, వడగట్టుకుని తాగడం అంటే పెద్ద పని కాబట్టి ఆ ముచ్చట ఒకటిరెండు రోజులే ఉంటుంది. దాంతో మిగిలిపోయినవి ఫ్రిజ్‌లో ఓ మూలన ఉండిపోతాయి. ఆకుకూరలూ అంతే వాటిని కాడల్లేకుండా కోసి, మట్టిపోయేలా శుభ్రంగా కడిగి పప్పో, కూరో వండుకుంటే బాగానే ఉంటుంది కానీ, 'మొన్నేగా పాలకూర పప్పు చేసుకుంది..ఇవాళ మళ్లీ మెంతికూర ఏం వండుకుంటాం అని పక్కన పెట్టేస్తుంటారు. దాంతో అవి కుళ్లిపోయి చివరకు పారేయాల్సి వస్తుంది. పిల్లలు కాకరకాయను తినరు కాబట్టి ఇంట్లో ఉన్న నలుగురి కోసం రెండురకాల కూరల్ని ఏం చేస్తామనే ఉద్దేశంతో అసలు కాకరకాయల్నే కొనరు కొందరు. మరికొన్ని కూరగాయల విషయంలోనూ ఇలాంటి సమస్యలే ఏవో ఒకటి ఉంటాయనే కారణంతో ప్రతి వారం దాదాపుగా ఒకేరకం కూరగాయల్ని తెచ్చుకుంటుంటారు కొందరు. కానీ ఎప్పుడూ ఒకేతరహా కూరగాయల్ని కొనుక్కుంటూ మిగిలినవాటిని పక్కన పెట్టేయడం వల్ల శరీరానికి అవసరమైన చాలా పోషకాలు అందవు. ఈ సమస్యలన్నీ ఆలోచించే కూరగాయలను మాత్రల రూపంలో తీసుకొచ్చేశారిప్పుడు. కొన్నాళ్లక్రితం వరకూ పండ్లూ, కూరగాయలను పొడులు చేసి అమ్మేవారు క్రమంగా పండ్లను మాత్రల రూపంలో తయారుచేస్తే..ఇప్పుడు కూరగాయల్నీ అలాగే తెస్తున్నారు.



ఉదాహరణకు బీట్‌రూట్‌ను తినడం వల్ల శరీరంలో రక్తశుద్ధి జరిగి, అధికరక్తపోటు అదుపులో ఉండి చర్మం ఆరోగ్యంగా ఉంటుందనేది తెలిసిందే. కానీ దాన్ని రోజూ కూరరూపంలో లేదా జ్యూస్‌గా తీసుకోవడం కష్టం అనుకునేవారికి ఆ మాత్రలు పరిష్కారాన్ని చూపిస్తాయి.



క్యారెట్‌పిల్స్ తోనూ అలాంటి లాభమే ఉంటుంది. వాటిని రోజుకొకటి వేసుకోవడం వల్ల కంటిచూపు మెరుగవ్వడంతో పాటూ చర్మం కూడా బాగుంటుందని అంటారు నిపుణులు. ఇవి మాత్రమే కాదు..ఇప్పుడు చాలా కూరగాయలు ఇలాగే వస్తున్నాయి.

**కూరగాయల సారమే**

మధుమేహులు రోజూ మెంతుల్ని నానబెట్టుకుని తింటే రక్తంలో చక్కెర్‌స్థాయిలు అదుపులో ఉంటాయని అంటారు. అయితే రోజూ వాటినే తినాలంటే మాటలు కాదు. బదులుగా ఇప్పుడు వచ్చే మెంతికూర మాత్రల్ని వేసుకుంటే సరిపోతుంది. టొమాటో, పాలకూర, కరివేపాకు, అల్లం, వెల్లులి , పుదీనా..వంటి వాటితో తయారుచేసిన మాత్రలతోనూ అలాంటి లాభాలే ఉంటాయి. అంటే..వాటి నుంచి వచ్చే పోషకాలను ఈ మాత్రలతోనూ పొందవచ్చన మాట. ఎందుకంటే వీటన్నింటినీ ఆ కూరగాయల సారం నుంచి తయారు చేస్తారు మరి. అయితే ఒక్కోకూరకు ఒక్కో మాత్ర వేసుకుంటూ కూర్చోలేం కదా అనుకోవచ్చేమో..నిజమే కానీ..ఎప్పుడైనా ఆ కూరచు తరచూ తినలేని పరిస్థితుల్లో దానికి సంబంధించిన ఒక మాత్రను వేసుకుంటే ఆ పోషకాలు కనీసం కొన్నయినా శరీరానికి అందుతాయి. ఇక, మల్టీవిటమిన్ మాత్రలు దొరుకుతున్నప్పుడు వీటిని ఎందుకు వేసుకోవాలనే సందేహం కలగడం మామూలే కానీ. ఈ మాత్రల్లో ఆ కూరగాయల సారం లేదా పొడి ఎక్కువగా ఉండి ఇతర కెమికల్స్ మోతాదు నామమాత్రంగానే ఉంటుంది కాబట్టి సందేహం లేకుండా వేసుకోవచ్చు.

**నేడు** విదేశీవిద్యపై మోజు పెరిగింది. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగం చేయడం, బ్యాంకులు విదేశీవిద్యకు రుణాలు మంజూరు చేయడం వంటి ఆర్థిక సౌకర్యాలు ఉండడంతో యువత విదేశీవిద్యపట్ల ఆసక్తిని పెంచుకుంటున్నది. మరి ఇప్పుడు ఈ ప్రస్తావన ఎందుకంటే మనదేశంలో ఏప్రిల్, మే నెలలో పరీక్షలు పూర్తయి, ఫలితాలు వచ్చాయి. తర్వాత ఏది చదవాలో ఎక్కడ చదవాలో అని పెద్దలు పిల్లలు ఒకేలా ఆలోచించే సమయం ఇది. పిల్లల జీవితంలో పెద్ద మలుపు తిరిగే పరీక్షా ఫలితాలు రావడంతో విదేశీ చదువులకోసం తమ దృష్టిని కేంద్రీకరిస్తున్నారు.



# విదేశీవిద్యకు ప్రణాళిక

అన్నిరంగాలలో వచ్చినట్టే పెనుమార్పు విద్యారంగంలో కూడా వచ్చింది. ఇప్పుడు ప్లస్ టూ చదివి పాస్ అయితే చాలా దేశాలలో చదువుకునే సౌకర్యం ఉంది. ప్రపంచం నలుమూలల ఎక్కడైనా వెళ్లి చదువుకునే వీలు ఉంది. ఇందుకోసం ఎద్యుకేషనల్ కన్సల్టెన్సీలు మనదేశంలో



అన్ని ప్రదేశాలలో వెలిసాయి. మరిన్ని వివరాల కోసం వెబినార్, సెమినార్ ఇంకా లోన్ సదుపాయాలు వసతి సదుపాయాలు వంటి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పైగా విద్యాభ్యాస నిపుణులు పిల్లలు వారి తల్లిదండ్రులతో ముఖాముఖీ మాట్లాడుతూ సందేహాలను నివృత్తి చేయడం నేడు సర్వసాధారణం. నేడు తమ పిల్లలు విదేశాలలో చదువుకోవాలి అని కలలు కనే తల్లిదండ్రులు కోకొల్లలు. ఆర్థిక పరిమితులు ఉన్న తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను విదేశాలలో చదివించాలని ఆలోచిస్తున్నారు. అంతేకాదు విదేశాలలో చదువుకుని మనదేశ అభివృద్ధికి పాటుపడిన వారు ఎందరో ఉన్నారు. మనదేశ స్వాతంత్ర్యానికి రాజ్యాంగ రచనకు విదేశీ చదువు ఎంతో ఉపయోగపడిందని గట్టిగ చెప్పవచ్చు. విదేశాలలో చదువుకోవడం వలన మనకి తెలియని ఎన్నో విషయాలు అవి నూతన శాస్త్ర సాంకేతిక విషయాలు, కళలు సంస్కృతులు జీవన విధానాలు తెలుస్తాయి. ఇంకా మానసిక వికాసం పెంపొందుతుంది. ఏ దేశంలో చదువుతున్నాం, ఎలాంటి విషయం మనం చదువుతున్నాం అని కాదు. మనం పుట్టి పెరిగిన వాతావరణం నుండి భిన్నంగా ఉండే ప్రదేశంలో చదవడం పెద్ద మార్పు. ఇతర దేశాల వారితో కలిసిమెలసి అవగాహనతో జీవించడం ఒక గొప్ప విషయం మాత్రమే కాదు ఇదే మొట్టమొదటి పాఠం.

మరో గొప్ప విషయం ఆధునిక విద్యాభ్యాస రీతుల పరిచయం, పరిశీలన విద్యార్థులకి దక్కుతుంది. కొత్త ఆవిష్కరణలు వెంటనే పాఠ్యాంశాలుగా అందుబాటులోకి తెస్తారు. విదేశాలలో చదువుకి ఎన్నో కొత్త వివరాలు తెలుసుకునే సౌలభ్యం ఉంది. మనదేశంలోని విశ్వవిద్యాలయాలు స్వతహాగా మార్పుకోసం ఆరాటపడవు. గత శతాబ్దంకాలం నాటి ఉన్న సిలబస్‌లను మాత్రమే నిర్దేశిస్తారు. కానీ విదేశీవిద్యావిధానంలో విద్యార్థి తనకి నచ్చిన విధానం ఎంచుకుంటారు. విదేశాలలోని విద్యాబోధన కూడా బట్టీపట్టేవిధంగా కాకుండా ఉపాధ్యాయుల మార్గనిర్దేశం మాత్రమే చేస్తారు తప్ప బలవంతపు బోధన కాదు. గతంలో ధనిక కుటుంబం నుండి ఎక్కువగా విదేశీ విద్యాభ్యాసం కోసం వెళ్లేవారు కానీ ఇప్పుడు మధ్య తరగతి కుటుంబం నుండి ఎక్కువగా వెళ్తున్నారు. అందువలన ఏమి చదవాలి ఎక్కడ చదవాలి ఆ తరువాత ఎలాంటి ఉద్యోగం సంపాదించాలి అనే మూడువిషయాలు వివరంగా తెలుసుకోవాలి. విదేశాలలో చదవడానికి మన దేశం విద్యార్థులు ఎంచుకునే ప్రధానమైన దేశాలు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్, న్యూజిలాండ్, ఐర్లాండ్, జర్మనీ, ఇంకా వైద్యవిద్య కోసం చైనా, యుక్రెయిన్, రష్యా, ఫిలిప్పైన్స్, కిరిస్థాన్, జార్జియా దేశాలను ఎంచుకుంటున్నారు. మనదేశం నుండి ఎక్కువగా ఇంజినీరింగ్, వైద్యవిద్య కోసమే విదేశాలకి వెళ్తుంటారు. ముందు గమనించవలసిన విషయం మనం ఎంచుకున్న కోర్సు మనదేశంలో గుర్తింపు పొందిందా. విదేశాలలో చదివి స్వదేశంలో ఉపయోగకపడడం కర్తవ్యం అని మర్చిపోకూడదు. చాలా విదేశాలలో సెప్టెంబర్ నెలలో విద్యాసంవత్సరం ప్రారంభం అవుతుంది కనుక మీరు ఇప్పటి నుండి అందుకోసం మీరు సిద్ధపడాల్సి వస్తుంది.

**- ఈ.ఎస్.మాధవన్**

**కథ**

# చంద్రగిరి రాజ్యం



చంద్రగిరి అనే రాజ్యం ఉండేది. ఆ రాజ్యానికి ఇంద్రవర్మరాజు. ఇంద్రవర్మకి నలుగురు కుమారులు. ఆ రాజ్యము ఆనవాయితీ ప్రకారం ఒక సంవత్సరానికి ఒక రాజు మాత్రమే పాలన చేయాలి. ఆ రాజ్యం దగ్గరలోనే నల్లగొండ అనే పెద్ద కొండ ప్రాంతం ఉంది. ఆ రాజ్యంలో ఏ రాజు అయినా ఒక సంవత్సరం రాజ్యపాలన చేశాక ఆ రాజు నల్లకొండ మీదికి వెళ్లిపోవాలి. అదేవిధంగా ప్రతి సంవత్సరం జరుగుతుంది. ఈ సంవత్సరం రాజు అయిన ఇంద్రవర్మ వెళ్లే సమయం వచ్చింది. ప్రతి రాజు నల్లగొండ మీదికి వెళ్లడం మరలా తిరిగి రాకపోవడం, ప్రజలకి, రాజులకి ఎవరికి అక్కడ ఏమి జరుగుతుందో అర్థం కావడం లేదు. రాజుగారు ఇంద్రవర్మ కొడుకులు నలుగురు ఒక ఉపాయం ఆలోచించారు. తన తండ్రి అయిన ఇంద్రవర్మరాజు నల్లకొండకి వెళ్లే సమయం వచ్చింది. కాబట్టి ఆ నలుగురు తండ్రికి తెలియకుండా ఆ ముందురోజు నల్లకొండకి చేరుకున్నారు. ఆ కొండపైన ఒక పెద్ద రాక్షసుడు ఉన్నాడు అది చూసి ఆ నలుగురు కుమారులు ఆశ్చర్యపోయారు. ఆ రాక్షకుడు కొండ మీదకి ఎవరు వచ్చినా వాళ్లని తినేస్తుంటాడు. ఆ రాజకుమారులు ఆ కొండప్రాంతమంతా చూశారు. అక్కడ అంతా కళేబరాలు, ఎముకలు ఉన్నాయి. అది చూసి ఆ నలుగురు ఇలా అనుకున్నారు. ఈ రాజ్యాన్ని రాజులని, ప్రజలని ఈ రాక్షకుడి బారి నుండి కాపాడుకోవాలి. లేకపోతే రేపు మనం కూడా ఈ రాక్షకుడికి ఆహారం అయిపోతాం. ఆ నలు గురు రాజకుమారులు ఒక్కసారి రాక్షసుడి చుట్టు ముట్టి రాక్షసుడిపైన బాణాల వర్షం కురిపించారు. వారి బాణాలధాటికి రాక్షసుడు మరణించాడు. అప్పుడే అటుగా కొంతమంది కొండజాతి ప్రజలు రాజకుమారులను చూశారు. ఆ మృగంలాంటి రాక్షసుడిని చంపినందుకు అభినందించారు. ఆ నలుగురి రాజకుమారులను కొండజాతి ప్రజలు ఊరేగించి రాజు అయిన ఇంద్రవర్మ దగ్గరకు తెచ్చారు. కొండజాతి ప్రజల మాటల ద్వారా రాజు అంతా తెలుసుకున్నారు. తన కుమారులను అభినందించారు.

'ఓ కుమారుల్లారా! మీ ఆలోచనకు ఆచరణ తోడైంది. కాబట్టి ఈ మార్పు సాధ్యం అయింది. ఏ రాజు అన్నది ముఖ్యం కాదు, అతడు ఏపాటి వాడు అన్నది ముఖ్యం. ఓ కుమారుల్లారా! నేను మిమ్మల్ని చూసి గర్వపడతున్నాను, మీలాంటి యువకులే ఈ రాజ్యానికి అవసరం అని ఇంద్రవర్మ తన పెద్ద కుమారుడిని రాజుని చేస్తాడు. మిగతా ముగ్గురు కుమారులని సహాయకులుగా ఉండమంటారు. దానికి ఆ నలుగురు కుమారులు అంగీకరస్తారు. కుమారులారా! మీరు రాక్షసుడిపై చేసే పోరాటం నన్ను ప్రజలను రక్షించే గుణం నాకు బాగా నచ్చాయి. రాజు అంటే రక్షించేవాడు' అని తండ్రి ఇంద్రవర్మ అభినందించారు. ఇంద్రవర్మ కుమారుడు యువరాజు ముగ్గురు తమ్ముళ్లను సహాయంతో రాజ్యపాలన నిస్వార్థబుద్ధితో చేస్తున్నారు. మరలా తండ్రి రాజకుమారులకు ఇలా బోధించారు. శరీర బలంతోపాటు బుద్ధిబలం ప్రతి రాజుకి ఉండాలి. యువరాజా! గొప్ప కథలలో నువ్వు లేకపోయినా, నీ కథ ఎప్పుడూ గొప్పగా ఉండేలా చూసుకో. రాజ్యపాలన చేసుకో అని హితం చెప్పారు. అప్పటి నుండి ఆ నలుగురు కుమారులు చంద్రరి రాజ్యాన్ని చక్కగా పాలిస్తున్నారు. చంద్రగిరి రాజ్యాన్ని సుజలాం, సుఫలాం, మలయతసీతారం, సస్య శ్యామలంగా రాజ్యాన్ని అభివృద్ధి చేశారు. ప్రజలంతా రాజకుమారులను చూసి జేజేలు పలికారు. ప్రజల ఆనందాన్ని చూసి ఇంద్రవర్మ తన నలుగురు కుమారులను అభినందించారు.

**- బల్ల కృష్ణవేణి,** పలాస




## బాలగేయం

### ఆటపాటలు

అ నుండి అమ్మ వచ్చెను
అ నుండి వర్ణమాల తెచ్చెను
అచ్చులతో
చెమ్మచెక్కలాడుదాం
రారండోయి
హల్లులతో తొక్కుడు
బిల్లలాడుదాం పదండోయి
గుణింతములతో సంగీతం
విందాం పలకండోయి
జంట పదాలతో
కలసిమెలసి ఉందాం
పదసంపదతో
తెలుగుమాల అల్లుదాం
కోడిగాని కోడితో
పకోడి చేద్దాం
మామగాని మామ
చందమామను చూద్దాం
జనంగాని జనంతో
భోజనం చేద్దాం
మాటలతో తాతయ్య
తికమకలు
చిన్నిపాటలతో అమ్మమ్మ
పకపకలు
ఏబది ఆరు అక్షరాల
పువ్వుల నవ్వులు
తెలుగుతల్లి పలికించే
మధుర స్వరాలు

**- పూసాల సత్యనారాయణ**

## హలో ఫ్రెండ్...



**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె.ఎస్.మురళి,** ఖమ్మం

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. 'జిడిపి' అంటే ఏమిటి? దాని ప్రయోజనాలు ఏమిటి?**

**జవాబు: మురళి!** ఆర్థిక వ్యవస్థ పరిమాణాన్ని అంచనా వేయడానికి అనుసరించే ప్రమాణాలలో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) ఒకటి. ఒక దేశం దాని భౌగోళిక సరిహద్దుల లోపల, ఒక నిర్ణీత కాలపరిమితిలో ఉత్పత్తి చేసే అన్ని తుది ఉత్పత్తులు, సేవల మార్కెట్ విలువను స్థూల జాతీయోత్పత్తిగా నిర్వచించారు. మధ్యంతర కాలానికి వర్తించే వస్తువుల విలువను లెక్కింపు పరిధి నుంచి మినహాయిస్తారు. లెక్కింపునకు గల బహుళ అవకాశాలను కూడా నివారిస్తారు. క్యాపిటల్ స్టాక్ (మూలధనం నిల్వ) తరుగుదల విలువను కూడా ఇందులో చేర్చరు. స్థూల దేశీయోత్పత్తి నుంచి తరుగుదలను తీసివేయగా వచ్చేది నికర దేశీయోతపత్తి (ఎన్డిపి).

**- అయాన్,** నాందేడ్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. మనలో రక్తం ఎంత ఉండాలి?**

**జవాబు: అయాన్!** మనలో రక్తం ఎంత వుండాలనేది మన బరువును, ఎత్తును అనుసరించి ఉంటుంది. సాధారణంగా 70 కిలోల బరువుగల వారికి అయిదున్నర లీటర్ల రక్తం ఉంటుంది. రక్తపరీక్షలో హిమోగ్లోబిన్ శాతం ఎంత ఉందనేది ప్రధానం గా చూస్తారు. ఒక క్యూబిక్ మిల్లీమీటర్ రక్తంలో నాలుగు నుంచి ఆరు మిలియన్ ఎర్ర రక్తకణాలు ఉంటాయి. పురుషులలో హిమోగ్లోబిన్ 13 నుంచి 15; స్త్రీలలో 11.5 నుంచి 13 మిల్లీగ్రాములు ఉండాలి.వీటికంటే తక్కువ ఉంటే 'రక్తలేమి '(ఎనీమియా) ఉందని నిర్ధారిస్తారు. రక్తం తక్కువగా ఉందని ఐరన్ టాబ్లెట్లు వాడ టం ఏమంత శ్రేయస్కరం కాదు. మనం సమతుల ఆహారం తీసుకుంటే అవసరమైన ఐరన్ చేకూరుతుంది. ఒకవేళ ఐరన్ టాబ్లెట్‌లను వాడాలనుకున్నప్పుడు కాల్షియం టాబ్లెట్లు, విటమిన్ ఇ వాడకూడదు. ఐరన్ టాబ్లెట్‌లను మోతాదుకు మించి వాడితే దుష్ఫలితాలు ఎదురవుతాయి.





# మనసు దోచేస్తున్న పిఛ్‌వాయీ

**కొన్ని కళలు**
ఎప్పుడు ఎందుకు ఎలా ప్రాచుర్యం పొందుతాయో చెప్పడం కష్టం.



అలాంటివాటిల్లో ఒకటి..రాజస్థాన్‌లోని నాథ్‌ద్వారాకి చెందిన పిఛ్‌వాయీ..విదేశాల్లోనూ కళాభిమానుల మనసు దోచుకున్న ప్రాచీన కళ ఇది. బాలకృష్ణుడి నుంచి రాధాకృష్ణుడి వరకూ నల్లనయ్య నేపథ్యంలో గీసిన అరుదైన సూక్ష్మచిత్రకళ.. తెల్లని ఆవూ గులాబీరంగులో విరిసిన తామరలూ కామధేనువూ గోవర్ధనగిరిని చిటికెన వేలుతో ఎత్తి పట్టుకున్న నల్లని చిన్నికృష్ణుడూ ఇలా అందులో ఎన్నో రకాల బొమ్మలు కనిపిసుంటాయి. ఇప్పుడు వీటినే డిజిటల్ ప్రింట్స్‌గా చిత్రించి ఇంట్లో అలంకరించుకుంటున్నారు. పెళ్లి





మండపాల్ని సైతం పిఛ్‌వాయీ థీమ్‌తోనే డిజైన్ చేస్తున్నారు. పెన్ కలంకారీ మాదిరిగానే, పిఛ్‌వాయీ చిత్రాలతో డిజైన్ చేసిన చీరల్ని చున్నీల్నీ అమ్మాయిలు ఇష్టంగా ధరిస్తున్నారు. ఏకానా, సయాంటి.. వంటి బొటిక్‌లు పిఛ్‌వాయీ చిత్రాల్ని ప్రత్యేకంగా డిజైన్ చేస్తున్నారు. ముఖ్యంగా తామరల డిజైన్‌కి విశేషమైన ప్రాచుర్యం లభించింది. అందుకే యాక్సెసరీల్లోనూ అరవిరిసిన తామరపువ్వులూ సగం ముడుచుకున్నట్లున్న ఆకులతో కూడిన చిత్రాలే కనిపిస్తున్నాయి. ఇప్పుడు ఇంతగా ప్రాచుర్యం పొందిన పిఛ్‌వాయీ చిత్రకళ గురించి తెలుసుకుందాం.

**శ్రీనాథ్‌జీ-పిఛ్‌వాయీ**

ఒంటినిండుగా నగలూ సిగలో నెమలిపింఛంతో ముద్దులొలికే చిన్ని కృష్ణుడి రూపాన్ని ఎంత చూసినా తనివితీరదు. అందుకేనేమో యశోదమ్మ తన మురిపాల కృష్ణుడిని రంగుల దుస్తులూ నగలతో అలంకరించి మురిసిపోయేది. అచ్చం అలాగే నిత్యం కన్నయ్యకి సింగార సేవలుఅ అందించే ఆలయమే నాథ్‌ద్వారా శ్రీరాథ్‌జీ టెంపుల్. అక్కడి కృష్ణుడికీ ఆయనకు చేసే అలంకారాన్నీ కళ్లకు కట్టినట్లుగా చూపించే సూక్ష్మచిత్ర కళే పిఛ్‌వాయీ. అందుకే నాథ్‌ద్వారా ఆలయం, పిఛ్‌వాయీ చిత్రం ఈ రెండింటిదీ విడదీయలేని బంధం. నాథ్‌ద్వారాలోని శ్రీకృష్ణుడు ఏడేళ్ల బాలుడు. ఆయన్ని ఇక్కడ శ్రీనాథ్‌జీ అని పిలుస్తారు. గోవర్ధన పర్వతాన్ని చిటికెన వేలుతో ఎత్తిపట్టుకున్న చిన్నికృష్ణుడి రూపంలో దర్శనమిస్తాడిక్కడ. నల్లని రాయితో చెక్కిన ఈ విగ్రహాన్ని మధుర సమీపంలోని పర్వతంమీద వల్లభాచార్య గురించి, విశాలమైన ఆలయాన్ని కట్టించి ప్రతిష్ఠించారట. అయితే హిందూ ఆలయాలన్నింటినీ ఔరంగజేబు ధ్వంసం చేయిస్తోన్న సమయంలో ఆలయ సంరక్షకులు శ్రీనాథ్‌జీ విగ్రహాన్ని దాచేందుకు తరలిస్తుండగా శిహార్ అనే ప్రాంతం దగ్గర బండిచక్రం కూరుకుపోయిందట. దాంతో ఆ ప్రాంతమే కృష్ణభగవానుడికి నచ్చిందని భావించి గుడి కట్టించారట. దాని చుట్టూనే నాథ్‌ద్వారా పట్టణం వృద్ధి చెందింది. అందుకే ఈ ఆలయం రాజస్థాన్‌లో ఉన్నప్పటికీ ఈ పట్టణ ప్రజల సంస్కృతీసంప్రదాయాలన్నీ మధురవాసుల్నే పోలిఉంటాయి. ఎక్కడ చూసినా బాలకృష్ణుడి చిత్రాలే కనిపిస్తాయి.

సాధారణంగా ఈ గుడిలో కృష్ణుడికి మేల్కొలుపు నుంచి పవళింపు వరకూ నిత్యం ఎనిమిదిరకాల సేవలు చేస్తుంటారు. ఆయా సేవల్లో అలంకారాలూ మారుతూనే ఉంటాయి. వాటన్నింటినీ సిల్కు లేదా నూలుబట్టల మీద చిత్రిస్తారు కళాకారులు. అలంకారాలతోపాటు గోవర్ధన పూజ, శరత్‌పూర్ణిమ, రాసలీల, హోలీ, కృష్ణజన్మాష్టమి, నంద మహోత్సవ్ పండుగల్ని కూడా కళ్లకు కట్టినట్లుగా చిత్రించడం నాథ్‌ద్వారా కళాకారులకి వెన్నతోపెట్టిన విద్య. మొదట్లో ఈ చిత్రాలను స్వామికి వెనక భాగంలో కట్టి రోజుకొకటి మార్చేవారట. విగ్రహానికి వెనుకభాగంలో వేలాడుతూ





ఉంటాయి కాబట్టే వీటిని పిచ్(వెనుక వాయి (వేలాడటం) అని పేరు వచ్చిందట. కృష్ణుడిని కొలిచే భక్తిమార్గానికి మరో రూపమే పిచ్‌వాయి కళ. ఆయాకాలాల్లో చేసే అలంకారాల్ని కళాకారులు యథాతథంగా చిత్రించి గుడి దగ్గరే విక్రయించడం, ఆలయంలోని చిన్నికృష్ణుడిని ఫొటోలు తీయనివ్వకపోవడంతో భక్తులు వాటినే కొని ఇంటికి తీసుకెళ్లి పూజిస్తుంటారు. స్వామికి సైతం ఈ పిచ్‌వాయీ చిత్రాలే కానుకలుగా ఇస్తుంటారట. విదేశీ టూరిస్టులూ వీటిని కొనుక్కెళ్లడంతో ఈ కళ ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం చెందింది.





తయారు చేసేవిధానం మందపాటి వస్త్రంమీద నలుగురంగులో స్వామిఎరిని చిత్రించి, ఇతర రంగులతో అలంకారాలు చేస్తుంటారు. అయితే ఒకప్పుడు ఈ చిత్రాలకోసం అన్నీ సహజరం గుల్నే వాడేవారు. బంగారు రంగుని బంగారం నుంచీ, వెండి రంగుని వెండిలోహం నుంచే తయారుచేసేవారు. బంగారం ప్రియం కావడంతో తరువాత ఆ రంగుకోసం జరీదారాలను వాడుతున్నారు. వేసవిలో వేసే పిచ్‌వాయీల్లో గులాబీరంగు తామరల నేపథ్యం ఉంటే, జమావరీ వర్కుతో కూడిన నేపథ్యం శీతాకాలాన్ని సూచిస్తుంది. ఇతర చిత్రాల్ల మాదిరిగా అచ్చంగా కుంచెతోనే దీన్ని వేయలేరు. పెన్ లేదా పెన్సిల్ స్ట్రోక్‌తోనూ గీయాల్సి ఉంటుంది. అందుకే ఒక్కో పిచ్‌వాయీకి నెలల సమయం పడుతుంది. అందువల్ల ఇప్పుడు బ్లాక్ ప్రింటింగ్‌తోనూ డిజిటల్ ప్రింటింగ్ టెక్నాలజీతోనూ పిచ్‌వాయీ చిత్రాల్ని రూపొందిస్తున్నారు. దాంతో కళాభిమానులతో పాటు కొత్తదనం కోరుకునే వాళ్లంతా సంప్రదాయ పిచ్‌వాయీ కళాఖండాల్లోని తామరల్నీ కృష్ణుడినీ ఆవుల్నీ నచ్చినట్లుగా డిజైన్ చేయించుకుని ప్రింట్స్ వేయించుకుంటున్నారు. గృహప్రవేశాలకు అందులోని ఆవుబొమ్మల్నీ పెళ్లి వేదికలమీద తామరల్నీ నేపథ్యంలో తీసుకుని డిజైన్ చేస్తున్నారు. పిచ్‌వాయీ కృష్ణుడి మెడలోని తామరల్నే పెళ్లి దండలుగానూ ధరిస్తున్నారు. ❑

## ఊపిరికి ఉరి కాలుష్యం

**(10వ పేజీ తరువాయి)**

కాలుష్యరహితమైన వస్తువుల వినియోగానికి దోహదం చేయాలి. ప్రజలను సహజసిద్ధమైన జీవనశైలికి సంసిద్ధం చేయాలి. మానవ సుఖసౌఖ్యాల కోసం ఉపకరిస్తున్న 'సైన్స్'ను సక్రమంగా వినియోగించుకోవాలి. శాస్త్ర పరిశోధనల ద్వారా అనేక ఆవిష్కరణలు వెలువడ్డాయి. సైన్స్ సమస్యలకు కారణం కాదు. ఆధునిక జీవనం పేరుతో మన పూర్వీకుల అపారమైన అనుభవ సారాంశాన్ని, అలనాటి జీవన విధానాన్ని హేళన చేసి, అనేక కష్టాలను కొని తెచ్చుకున్నాం. పర్యావరణ ప్రేమికులను ప్రోత్సహించాలి. ప్రకృతిని కాలుష్యపు కోరలనుండి విముక్తి చేయాలి. భూగ్రహానికి గతకాలం నాటి శోభను సంతరింపచేసి, పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించాలి. ప్రకృతిని పరిరక్షించాలి. ప్రకృతి ప్రేమికులు, పర్యావరణవేత్తలు, కవులు, రచయితలు తమ కలాలకు పదును పెట్టాలి. ప్రకృతిని పరిరక్షించి, భూతాన్ని కాపాడేందుకు 'రాచెల్ లూయిస్ కార్సన్' వంటి పర్యావరణవేత్తల ఆలోచనలు స్ఫూర్తి కావాలి. గేలార్డ్ నెల్సన్‌లాంటి దూరదృష్టిగల సామాజిక సేవా దృక్పథం కలిగిన మహనీయులు ముందుకు రావాలి. ప్రపంచస్థాయి స్థలు, ప్రభుత్వాలు, పర్యావరణవేత్తలు పర్యావరణ పునరుద్ధరణకు నడం బిగించి, మానవాళిని పెనుసంక్షోభం నుండి బయటకు తీసుకురావడానికి వడివడిగా అడుగులు వేయాలి. పర్యావరణ విధ్వంసం జీవరాశుల అంతానికి ఆజ్యం పోస్తున్నది. అన్ని జీవరాశులతో సమతుల్యంగానే ప్రకృతిలో జీవవైవిధ్యం అడుగంటిపోతున్నది.

పర్యావరణానికి మానవ స్వార్థం తూట్లు పొడుస్తున్నది. పెరిగిన మానవ విజ్ఞానం భస్మసుర హస్తంలా మానవాళి నెత్తిన పిడుగుపాటులా పరిణమిస్తున్నది. పచ్చని చెట్ల స్థానంలో ఆకాశాన్నంటే భవనాలు వెలుస్తున్నాయి. ఇకనైనా మానవ ఆలోచనాసరళిలో మార్పు రావాలి. పర్యావరణ విధ్వంసాన్ని నిరోధించాలి. కాలుష్యరహితమైన, ఆహ్లాదకరమైన పచ్చని ప్రకృతిని భావితరాలకు బహుమతిగా ప్రసాదించాలి. ❑

కథ

# ప్రేమ మూట

నూతలపాటి నాగేశ్వరరావు

"సున్నిండలు నాల్గు పెట్టు, అమ్మకు ఇష్టం"

"సరే.." "ఈ పాకెట్ ఏంటి? మందులా?"

"అవును, తెప్పించాను"

"పాకెట్ పెద్దదిగా వుంది. ఆరు నెలలకు సరిపడా తెప్పించినట్లున్నావు"

"తమ్ముడు, మరదలు పిసినారులు. వాళ్లు తెప్పిస్తారో లేదోనని తెప్పించాను"

"ఏమి ప్రేమ ఒలకబోస్తున్నావు? డబ్బులు ఊరికే వస్తాయా? అనవసరపు ఖర్చులు పెడతారెందుకు. మందుల షాప్‌లో తిరిగిచ్చి, నాక్కావలసిన కాస్మొటిక్స్ తెలుసుగా! అవి తీసుకోండి".

భార్య జయను చూస్తూ చంద్రం బిక్క మొఖం వేసుకొని అలానే చూస్తున్నాడు.

"చూసింది చాలు, చెప్పినట్లు చెయ్యి".

నాల్గు నేత చీరెలు, జాకెట్లు సర్దింది జయ".

"వీటిని మూట కట్టి వరండాల్లో పెట్టు. నాకు తెలియకుండా ఏమైనా మూటలో పెట్టావో.."

"సరే. అలాగే. బట్టలు ఉతికినట్లు లేదు, వాసన వస్తున్నాయి"

"ఇవన్నీ నీకెందుకు? చెప్పిన పని చెయ్యి"

గూడు కట్టుకొని వున్న కన్నీరు కంటి నుండి కిందికి వెచ్చగా జారి మూట ముడిపై పడి ప్రేమ ముద్రలుగా ఇంకిపోతున్నాయి.

"పిచ్చి మొగమా! వేళకు తినకుంటే ఎలా? ముందు ఈ బిళ్ల మింగు, జ్వరం తగ్గిపోద్ది. నోరు తెరువు" అంటూ తన కుడి చేతి రెండు వేళ్లతో పెదవులు వెడల్పు చేసి, మందుబిళ్ల నోటిలో వేసి గ్లాసు నీళ్ల తాగిపించి మాడుపై సుకుమారంగా తట్టి, అమ్మ తన పమిటచెంగుతో నోటిని తుడవడం చంద్రంకు గుర్తుకొచ్చి కన్నీరు సముద్రమై మరింతగా పెల్లుబుకుతోంది.

"ఏమి చేస్తున్నారు? రండి. రిక్షా సాంబయ్య వచ్చి అరగంట అయ్యింది" జయ మాటలకు కళ్లు తుడుచుకొన్నాడు.

"ఇదిగో సాంబయ్యా! మూట తీసుకొని అమ్మను అక్కడ దించు" అంటూ చంద్రం మూటను సాంబయ్య చేతికిచ్చాడు.

రిక్షాలో మూటను పెట్టి, కలుగోలమ్మను చెయ్యి పట్టుకొని నడుంపై మరొక చెయ్యి అదిమిపట్టుకొని రిక్షా ఎక్కించాడు. సాంబయ్య రిక్షా తొక్కుకుంటూ వెళ్తున్నాడు.

సాంబయ్య చెవులకు దబీలుమని శబ్దం వినిపించి తల వెనుకకు తిప్పి చూశాడు.

కలుగోలమ్మ రిక్షా సీటుపై నుండి కిందకు వాలిపడింది.

రిక్షా ఆపి హుటాహుటిన అడుగులేసి రెండు చేతులతో కలుగోలమ్మను పట్టుకొని అతి కష్టంగా లేపి సీట్లో కూర్చోబెట్టాడు.

తనకు ఏమీ కాలేదు, బాగున్నానని చేతితో సైగ చేస్తోంది.

కాసేపటికి ఇంటి దగ్గరకు రిక్షా చేరింది. ఇంటి తలుపులు మూసి ఉన్నాయి.

"అమ్మా, రిక్షా దిగకండి, చిన్న అబ్బాయి గారి ఇంటి తలుపులు తెరిచిలేవు"

సాంబయ్య మాటలకు కలుగోలమ్మ ముఖంలో ఎలాంటి భావనలు కనిపించడం లేదు.

ఎలాంటి మొఖభావాలు లేకుండా కంటిరెప్పలు సగం తెరచి అలానే చూస్తోంది.

కలుగోలమ్మను చూసిన సాంబయ్యకు మనసు చివుక్కుమంది

"కొద్దిసేపు ఓర్చుకోండమ్మా. అబ్బాయి తలుపులు తీయగానే ఇంట్లోకి వెళ్దాం" అని సముదాయిస్తున్నాడు.

కలుగోలమ్మను చూస్తుంటే సాంబయ్య మనసులో ఆందోళన కలుగుతోంది.

కొడుకులు వ్యాపారాలు చేసుకుంటూ బాగా సంపాదిస్తూ దాబాలు కట్టుకొని పిల్లల్ని బాగా చదివించుకుంటూ సుఖంగా వుంటుంటే కలుగోలమ్మకి ఈ గతి పట్టడం తలచుకుంటుంటే సాంబయ్య కడుపు దేవినట్లుంది.

మంచు బాగా వుండడంతో రిక్షా సీటుపై పడుకొని కలుగోలమ్మ బలవంతంగా శ్వాస తీసుకుంటోంది.

చూస్తుంటే కలుగోలమ్మ పరిస్థితి అంత బాగున్నట్లు అనిపించకపోవడంతో సాంబయ్య నాలుగు అడుగులు వేసి మూసి వున్న తలుపులు చేతితో తడుతున్నాడు.


కొక్కరొక్కో అని కోళ్ల అరుస్తూ నిద్ర లేపడానికి ప్రయత్నిస్తున్నాయి.

"తెల్లారిందా సాంబయ్యా? అమ్మను తీసుకొచ్చావు, లోపలకు తీసుకురా" అంటూ సూర్య తలుపులు తెరిచాడు.

"జాగ్రత్తగా దిగమ్మా, మెల్లగా... మెల్లగా.." అంటూ తన రెండు చేతులు కలుగోలమ్మను పట్టుకొని రిక్షా నుండి కిందకు దింపాడు. రిక్షా సీటుపై వున్న మూటను తీసుకున్నాడు.

"ఇంత పొద్దున్నే రాకపోతే నిదానంగా తగలడొచ్చు కదా!" "అలా అనకే. నన్ను కని పెంచి పోషించి పెద్ద చేసిన అమ్మ"

"మామయ్య చనిపోయినప్పుడు ఆదరింపుల సమయంలో చేసిన పంచాయతీ వల్లే ఇదంతా వచ్చింది. ఆరు నెలలు పెద్దబ్బాయి దగ్గర, మరొక



ఆరు నెలలు చిన్నబ్బాయి ఇంట్లో. నువ్వేమో దూదూ బసవన్నలా తలూపావు.

"అయ్యా! వెళ్లి వస్తాను" చెప్పాడు సాంబయ్య.

సాంబయ్య కలుగోలమ్మను కళ్లారా చూసి భుజంపై నున్న కండువా ఒకసారి తీసి మొఖం తుడుచుకొని ఇంటి బయటకు వచ్చాడు.

"ఈరోజు నుండి మళ్లీ మొదలు. ఈ చాకిరీ ఎందుకు చెయ్యాలి?" ప్రియ నసుగుతోంది భర్త సూర్యతో.

"ఏంటి అలా మాట్లాడుతున్నావు? అమ్మ అంటే నీకైనా నాకైనా అమ్మే! మనం ప్రేమతో చూసుకోవాలి" అమ్మకు వినపడకూడదని తక్కువ స్వరంతో ప్రియతో చెబుతున్నాడు.

"ఇరవై రెండు సంవత్సరాల నుండి ఇదే తంతు. మొన్నటిదాకా ఇంట్లో పనులన్నీ చేసేది. మనకు పనిమనిషి ఖర్చు మిగిలేది. ఇప్పుడు ఎదురు చాకిరీ చెయ్యాలి. ఒక రోజా? రెండు రోజులా? ఆరు నెలలు" ప్రియ భర్తతో గొంతు పెద్దది చేసి మాట్లాడుతోంది.

"అమ్మకు ఓపిక ఉన్నంతవరకు మనకు చాకిరీ చేసింది. ఇప్పుడు అనారోగ్యంతో వుంది. మనం జాగ్రత్తగా చూసుకోవాలి కదా" బదులు చెప్పాడు సూర్యం.

"నీకు ఏమి చెప్పినా ఎలా చెప్పినా అర్థం కాదు"

సూర్యం అమ్మ దగ్గరకు వెళ్లాడు. పలకరించాలని ప్రయత్నించాడు. నోటి వెంట అమ్మా అనే పదం బయటకు రావడం లేదు.

అమ్మ కలుగోలమ్మ మౌనంగా స్టూలుపై నీరసంగా కూర్చొని వుంది. కొడుకుని చూస్తోంది.

కలుగోలమ్మకి కడుపులో గడబిడగా వుంది. కోడల్ని అడగలేకపోతోంది. కొడుకునీ అడగలేకపోతోంది. తల తిరుగుతున్నట్లుంది. పరిగడుపున వేసుకొనే మాత్ర తన వద్ద లేదు. మౌనంగా అలానే కూర్చుండిపోయింది.

"ఏమిటి దుర్గంధం? ఎక్కడ నుండి వస్తోంది?" అంటూ ప్రియ వంట గదిలో నుండి హాల్లోకి వచ్చింది.

అత్తయ్య కూర్చున్న స్టూల్ దగ్గర నుండి దుర్వాసన వస్తోంది.

"దొడ్లో లెట్రిన్ వుంది కదా! నువ్వేమైనా ఇంటికి కొత్తదానివా? కనీసం బుద్ధి, జ్ఞానం లేకుండా. ఎక్కడబడితే అక్కడ.. ఛీ..ఛీ.." కోప్పడుతోంది ప్రియం.

కలుగోలమ్మ బదులు చెప్పడానికి గొంతు ఎండిపోయి మాట పెగలడం లేదు.. చేతితో సైగ చేస్తోంది.

ప్రియకు చిర్రెత్తిపోతోంది. పనిమనిషి కూడా రాలేదు.

"ఎక్కడంటే అక్కడ.. సిగ్గు..లేదు..ఛీ" తిట్టుకుంటూ అత్తయ్యను రెండు చేతులతో పట్టుకొని లేపి నడిపించుకుంటూ దొడ్లోకి తీసుకువెళ్లింది.

స్టూలుపై కూర్చోబెట్టింది. బట్టలు విప్పదీసి శుభ్రంగా నీళ్లలో డెటాల్ కలిపి శుభ్రం చేసింది.

కూతుర్ని కనలేదన్న వెలితి ప్రియకు తీరిపోయినట్లుంది. కలుగోలమ్మను టవల్‌తో తుడుస్తుంటే కలుగుతున్న ఎల్లలులేని మధురానుభూతిని వర్ణించడానికి మాటలు చాలవు.

ప్రియ హృదయమంతా ఆనందంతో నిండిపోయింది.

నోటి నుండి దుర్వాసన వస్తుండడంతో కలుగోలమ్మ మొఖం కడుక్కోలేదని టూత్‌పేస్ట్ చేతిలో వేసుకొని అత్తయ్య నోట్లో పెట్టి రుద్దుతోంది.

ప్రియ చిన్నతనంలో మారాం చేస్తే బలవంతంగా నోటిని శుభ్రం చేసేది.

నీళ్ల నోట్లో పోసి పుక్కిలించమని చెప్పింది. కలుగోలమ్మ నీటిని పుక్కిలించి వుయ్యలేకపోతోంది.

ప్రియ తన ఎడమ చేతితో కలుగోలమ్మ తలను వంచి నోటిలోని నీళ్లను బయటకు వచ్చేలా చేసింది.

మరొక చీర కట్టడానికి మూట వైపు ప్రియ వెళ్లింది.

మూట నుండి వాసన వస్తుండడంతో ఇంట్లోకి వచ్చి తన వార్డ్ రోబ్‌లో వున్న ఒక చీరను తెచ్చి అత్తయ్యకు కట్టి మెల్లగా ఇంట్లోకి వచ్చింది.

ఆరు నెలలు పూర్తయిన మరుసటి రోజు వేకువ ఝామునే బట్టల మూటతో సాంబయ్య రిక్షా ఎక్కించి ఇక్కడకు పంపుతుంది. ఇక్కడకు వచ్చిన తరువాత బట్టలు ఉతుక్కోవాలి. మందులు పంపదు, అన్నీ ఇక్కడే కొనాలి. రిక్షా బాడుగ కూడా ఇచ్చుకోవాలి.

గత పదిహేను సంవత్సరాల నుంచి సాంబయ్య రిక్షా బాడుగ తీసుకోవడం లేదు. అదేమని అడిగితే సాంబయ్య ముసి ముసిగా నవ్వుతాడేగానీ సమాధానం చెప్పడు.

ఇక్కడ ఆరు నెలలు కాగానే సూర్యం ఇంటి నుండి అలానే అక్కడకు పంపడం ఆనవాయితీ అయ్యింది.

"అయ్యా! వెళ్లి వస్తాను" చెప్పాడు సాంబయ్య.
సాంబయ్య కలుగోలమ్మను కళ్లారా చూసి భుజంపై నున్న కండువా ఒకసారి తీసి మొఖం తుడుచుకొని ఇంటి బయటకు వచ్చాడు.
"ఈరోజు నుండి మళ్లీ మొదలు. ఈ చాకిరీ ఎందుకు చెయ్యాలి?" ప్రియ నసుగుతోంది భర్త సూర్యతో.

ప్లేట్‌లో కొంచెం ఉప్మా పెట్టుకొచ్చి కలుగోలమ్మ పక్కన కూర్చొని చేతితో తినిపించడానికి ప్రయత్నిస్తోంది.

కలుగోలమ్మ నోరు సరిగ్గా తెరవలేకపోతోంది. ప్రియ తన ఎడమ చేతివేళ్లతో పెదవులు తెరచి ఉప్మా కొంచెం కొంచెంగా నోట్లో పెడుతోంది.

"అమ్మకు కావాల్సిన మందులు తెచ్చాను" అంటూ మందుల పొట్లం ప్రియ చేతికిచ్చాడు.

సూర్యం అమ్మ వైపు చూశాడు. అమ్మ ముఖ కవళికలు అర్థం చేసుకోలేకపోతున్నాడు.

ప్రియ తన భర్త తెచ్చిన మందులలో షుగర్‌బిళ్ల అత్తయ్య నోట్లో పెట్టి నీళ్లు తాగించింది.

సోఫాపై పడుకోబెట్టింది.

అత్తయ్య పట్ల తన మనసులో ప్రేమభావం కలుగుతోంది.

ప్రియ చిన్నతనంలో నిద్రలో సిస్సు అలవాటు వుండేది. రోజూ పక్క తడపడం దుర్గంధం వస్తున్నా అమ్మ విసుక్కోకుండా రోజుల పడి దుప్పట్లు మార్చి శుభ్రం చెయ్యడం గుర్తుకు వచ్చి, కళ్లు చెమ్మగిల్లుతున్నాయి.

ప్రియ మనసు మనస్సులో లేదు. అశక్తురాలుగా వున్న అత్తయ్యను చూస్తుంటే తెలియని జాలి, ఆపేక్ష జనిస్తోంది.

గత ఇరవై ఐదు సంవత్సరాలుగా కలుగోలమ్మను చూస్తే తనకు కోపం, ద్వేషం కలుగుతుండేవి. ఈరోజు ఎందుకో తన మనసులో ప్రేమభావన కలుగుతోంది. ప్రియ మనసులో ప్రశాంతత కనిపిస్తోంది.

అమ్మను చూస్తే చిటపటలాడే ప్రియలో కలుగుతున్న మార్పు గమనించాడు.

అమ్మ సోఫాపై పడుకొని వుంది. పలకరిద్దామనుకున్నాడు. నోటి నుండి మాటలు పెగలడం లేదు. అమ్మను సరిగ్గా చూడలేకపోతున్నందుకు సూర్యం బాధపడుతున్నాడు. గత ఇరవై ఐదు సంవత్సరాల నుండి సంవత్సరానికి ఆరు నెలలు తన వద్ద వున్నా ఆప్యాయంగా ఏనాడూ అమ్మను పలకరించలేదు.

సూర్యానికి అరవై వసంతాలు నిండినా అమ్మ పట్ల ప్రేమగా వుండలేకపోతున్నాననే పశ్చాత్తాపం కూడా లేదు.

సూర్యం ఇద్దరు పిల్లలకు పెళ్లి అయి ఎవరికి వారు స్థిరపడి సంతోషంగా వున్నారు. ఒక ఆదివారం పిల్లలు ఫోన్‌లో పలకరించకపోతేనే మనసు బాధపడుతుంది. కన్నతల్లిని తాను పట్టించుకోకపోయినా, ప్రేమగా వుండకపోయినా చింతలేదు సూర్యానికి.

ప్రియ వంట హడావుడిలో వుంది. హాల్లో నుంచి తెంపర్లు తెంపర్లుగా దగ్గు వినిపిస్తోంది.

ప్రియ హాల్లోకి వచ్చి చూసింది. అత్త కలుగోలమ్మ సోఫాపై వెల్లకిలా పడుకొని దగ్గుతోంది.

దగ్గరకు వెళ్లి చేతితో గుండెపై తట్టింది. కానీ దగ్గు తెంపరలు తగ్గడం లేదు.

నీళ్ల వెచ్చచేసి, లోటాతో తెచ్చి చేతితో తల లేపి నీళ్ల తాగించింది. గుక్క వెయ్యలేకపోతోంది.

ప్రియ రెండు చేతులతో కలుగోలమ్మను సోఫా నుండి పట్టుకొని లేపి వరండాలో వున్న మంచంపై పరుండబెట్టింది. శరీరం వణుకుతున్నట్లుగా అన్పించడంతో పలుచని దుప్పటి తెచ్చి కప్పింది.

ప్రియ వంట చేస్తోంది కానీ మనసులో మనసు లేదు.

.........

"మేం కట్నకానుకలు ఇచ్చుకోలేం. మీరు పెద్దవారు. మీ అబ్బాయి సంబంధం తెచ్చినతనికి చెప్పినా మీరు అమ్మాయిని చూడటానికి వచ్చారు. మమ్మల్ని క్షమించండి" ప్రియ నాన్న ఏడుకొండలు చెబుతున్నారు.

"అమ్మాయి లక్షణంగా వుంది. కట్నకానుకల ప్రస్తావన మన మధ్య ఎందుకు? మొగుడూ పెళ్లాలు కష్టపడి కావాల్సినంత సంపాదించుకుంటారు. ముహూర్తాలు పెట్టించండి అన్నయ్యగారు" కలుగోలమ్మ చొరవ, ప్రోద్భలంతో ప్రియకు వివాహం జరిగింది.

"మీరు ఆస్తిపరులు. అమ్మాయి నుండి మీకు ఆస్తి ఏమీ రాదు. అమ్మాయి నాన్నగారు సంపాదించేది ఒక్క పూట తిని, మరోపూట పస్తులుంటేగానీ సరిపోదు. మీ సంబంధం మాకు ఇష్టమైనా ఎందుకో భయంగా వుంది" మేనమామ నరసింహారావు చెబుతున్నాడు.

"అలా అనకండి. నా ఆస్తి అంతా అమ్మాయికే రాస్తాను" భరోసా ఇచ్చింది కలుగోలమ్మ.

"మీ పెద్దబ్బాయి ఒప్పుకుంటాడా?" అడిగాడు మేనమామ.


"పెద్దబ్బాయికి ఆస్తి నేను ఇవ్వవలసిన అవసరం లేదు. వాడు బాగానే సంపాదించుకుంటున్నాడు. నా మాటకు ఎదురు చెప్పడు" అంటూ చంద్రం వైపు చూసింది.

"అమ్మ మాటే నాకు వేదం. యావదాస్తి మరదలు పేర రాసిచ్చినా అభ్యంతరం లేదు. రాతపూర్వకంగా ఇప్పుడే ఇస్తాను" చంద్రం అమ్మ వైపు చూసి చెబుతున్నాడు.

"నా చిట్టి తండ్రే" అంటూ మెటికలు విరిచింది కలుగోలమ్మ.

తన జీవితానికి ఒక అర్థం కల్పించిన అత్తయ్య పట్ల గౌరవం చూపలేకపోయాను.

మామయ్య మరణించినప్పుడు ఆదరింపుల సమయంలో ఆస్తి పంపకాలప్పుడు చేసిన గొడవకు సిగ్గుపడుతోంది ప్రియ.




వివాహమైన కొత్తల్లో ప్రియకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసింది.

తనకిష్టమైన పిండివంటలు, పచ్చళ్ల తనే స్వయంగా తయారు చేసి కొసరి కొసరి వడ్డించేది. మామయ్య చనిపోయేంత వరకు కన్నబిడ్డలా చూసుకుంది.

ప్రియ పేరున ఇల్లు రిజిస్టర్ చేయాలని గట్టిగా అడిగినప్పుడు పెళ్లి చూపులప్పుడు చేసిన వాగ్దానం మేరకు పెద్ద కుమారునికి కాదని తన పేర రిజిస్ట్రేషన్ చేయించింది.

ఆలోచనలతో ప్రియ తల ఎత్తి ఇంటి సీలింగ్ వైపు చూసింది. ఈ ఇల్లు



అత్తయ్య, మావయ్య కష్టార్జితం. తన ఇంట్లో వుంటూ అత్తయ్యను సరిగ్గా చూడకపోవడం, పైగా ఇంటిచాకిరీ అంతా చేయించుకోవడం గుర్తుకొస్తుంటే కలుగుతున్న మానసిక ఆవేదనను తట్టుకోలేకపోతోంది. కంటి నుండి కన్నీరు పెల్లుబుకుతోంది.

చంద్రం అమ్మా నాన్నలు సంపాదించిన ఆస్తులు అక్కరలేదని వేరేగా అద్దె ఇంట్లో వుంటూ వ్యాపారంలో సంపాదించి ప్రియ భర్త కంటే ఉన్నతంగా ఖరీదైన జీవితాన్ని అనుభవిస్తున్నాడు. మూడంతస్తుల డాబా కట్టించాడు. ఇద్దరమ్మాయిలకు వివాహం జరిపించి పంపాడు.

ఆస్తి పొంది తాము చేసిందేమిటి? తలచుకుంటుంటే మనసంతా భారమవుతోంది ప్రియకు.

.........

పెద్దగా దగ్గు వినపడి ఉలిక్కిపడి ప్రియ స్టూల్ మీద నుండి లేచి కలుగొలమ్మ దగ్గరకు వెళ్లి చూసింది.

ప్రియ మంచంపై కూర్చొని అరచేతితో నుదిటిపై పెట్టి చూసింది. వెచ్చగా వుంది.

గూట్లో వున్న థర్మామీటర్ మంచినీటిలో కడిగి తీసుకువచ్చి అత్తయ్య నోట్లో పెట్టి చేతితో పట్టుకుంది. రెండు నిమిషాల తర్వాత చూసింది.. 102 డిగ్రీల జ్వరం వుంది.

టవల్‌ను చల్లని నీటిలో ముంచి నుదుటిపై వుంచింది. అయినా మెల్లగా దగ్గుతూనే వుంది కలుగోలమ్మ.

"ప్రియా!" అంటూ సూర్యం ఇంట్లోకి వచ్చాడు.

"అమ్మకు ఏమయ్యింది?" అమ్మ వైపు చూస్తూ అడిగాడు సూర్య. అమ్మ పరుండిన మంచం వైపు అడుగులేశాడు. మంచంపై అమ్మ పక్కన కూర్చున్నాడు.

దగ్గడం ఆగింది. కళ్ల తెరచి కొడుకు సూర్యాన్ని చూసింది, కానీ ఏమీ మాట్లాడలేదు.

అమ్మ చెయ్యి సూర్యానికి వెచ్చగా తగిలింది.

ప్రియ మందుబిళ్ల తీసుకొని అత్తయ్య నోటిలో వేసి మంచినీళ్లు తాగించింది.

"తొందరగా రా ప్రియా! ఆకలి వేస్తోంది" డైనింగ్ టేబుల్ వద్ద కూర్చొని పెద్ద పెద్దగా అరుస్తున్నాడు. సూర్యానికి ప్రియలో ఏదో తేడా కనిపిస్తోంది. వడ్డించిన అన్నం తిని చేతులు కడుక్కొని సూర్యం అక్కడనుండి లేచాడు.

ప్రియకు అన్నం తినబుద్ధి కాలేదు. ప్లేట్‌లో కొంచెం అన్నం పెట్టి రసంతో మెత్తగా కలిపి అత్తయ్య దగ్గరకు వెళ్లి నోట్లో కొంచెం కొంచెంగా పెడుతోంది.

"చాలని.." చేతితో సైగ చేయగానే మంచినీళ్లు తాగించి బెడ్‌పై పరుండబెట్టి, ప్లేట్ తీసుకొని కిచెన్‌లోకి వెళ్లింది. ఉదయం నుండి ఆలోచనలు.. మనసులో కలుగుతున్న భావాలు ప్రియ మనసును ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

.........

రోజులు గడచిపోతున్నాయి. సూర్యం తన వ్యాపారం చూసుకుంటున్నాడు.

ఇంట్లో మందుబిళ్లలు వుంటే ప్రియ అత్తయ్యకు వేసేది.

షుగర్, బి.పి. బిళ్లలు అయిపోయి నాలుగు రోజులయ్యింది.

"ఏమండీ! షాప్ నుండి వచ్చేటప్పుడు అత్తయ్యకు బీపీ, షుగర్ బిళ్లలు తీసుకుండి. నాల్గు రోజుల నుండి చెబుతున్నాను, మీరు మరిచిపోతున్నారు" ప్రియ గుర్తు చేస్తోంది.

"గాబరా పడకు. నాలుగైదు రోజులకు ఏమీ కాదు. ఆదివారానికి అమ్మ వచ్చి ఆరు నెలలు పూర్తవుతుంది. అన్నయ్య దగ్గరకు పంపితే వాళ్లు చూసుకుంటారు" చెబుతున్నాడు.

కలుగోలమ్మ వరండాలో బెడ్‌పై పడుకొని వుంది. మగత నిద్రలో వుంది.

"మీ యిష్టం" అని చెప్పి ప్రియ తన పనిలో తాను మునిగిపోయింది.

రోజులు గడిచేకొద్దీ కలుగోలమ్మ ఆరోగ్యం క్షీణిస్తూ వుంది. నీరసించి పోతోంది. వాతావరణం వేడిగా వుండడం వల్ల ఇబ్బంది పడుతోంది.

"గడియారం ముల్లు గతి తప్పుతుందేమోగానీ సాంబయ్య రావడంలో ఆలస్యం జరగదు.

ఆరు నెలలకు ఒకసారి కలుగోలమ్మను ఇక్కడ నుండి అక్కడకు, అక్కడ నుండి ఇక్కడకు తీసుకురావడం తలచుకుంటే ఆశ్చర్యంగా ఉంటుంది.

సూర్యం వెళ్లి తలుపు తీశాడు.

ఇంటి దొడ్లో పెట్టిన మూట తీసుకొని సాంబయ్య హాల్లోకి వచ్చాడు.

కలుగోలమ్మ మంచంపై పడుకొనే వుంది. వేకువజాము కావడంతో నిద్ర లేకలేకపోతోంది.

ఒక చేత్తో మూట పట్టుకొని రెండవ చేతితో కలుగోలమ్మను తట్టాడు.

"అమ్మా! లెగండి.. మనం బయలుదేరాలి" అన్నాడు.

మగతగా కనురెప్పలు తెరచి సాంబయ్యను చూసింది.

సాంబయ్యను చూడగానే కలుగోలమ్మ మనసులో ఆందోళన కలుగుతోంది.


తనకు వివాహం అయినప్పటి నుండి కాపురం చేసిన ఇల్లు. ఇటుక ఇటుకలో తన ప్రాణం కలిసి వుంది. ఇంటి పైకప్పును తల తిప్పుతూ చూస్తోంది. గత స్మృతులు తనను చుట్టుముడుతున్నాయి.

భర్తతో, పిల్లలతో గడిపిన రోజులు గుర్తుకొస్తున్నాయి. మనసులోని హృదయ స్పందనలకు కళ్లు ఆర్ద్రతతో నిండిపోయాయి.

మాటలకు అందని భావన అనుభూతిని కలిగిస్తోంది కలుగోలమ్మకు.

"లెగండి..బయలుదేరదాం" సాంబయ్య మాటలకు తన కుడి చెయ్యి బలవంతంగా కదిలించింది.

సాంబయ్య మూటను తీసుకొని వచ్చి రిక్షా సీటుపై పెట్టి, ఇంట్లో హాల్లో కలుగోలమ్మ పరుండిన మంచం దగ్గరకు వచ్చాడు. తన రెండు చేతులతో




కలుగోలమ్మను పట్టుకొని మంచం నుండి దింపాడు.

నిలబడలేకపోతోంది.. ముందుకు వాలిపోతోంది.

"జాగ్రత్త.. భయపడకండి, నేను పట్టుకున్నాను. మెల్లగా అడుగులు వెయ్యండి" అంటూ సాంబయ్య రెండు చేతులతో కలుగోలమ్మను పట్టుకొని రిక్షా వరకు తీసుకువెళ్లాడు.

రిక్షా ఎక్కడానికి కలుగోలమ్మ కాలు పైకి లేవడం లేదు. అలానే వంగి నిలబడింది.

సాంబయ్య తన రెండు చేతులతో నడుం వద్ద పట్టుకొని రిక్షా సీటుపైన జాగ్రత్తగా కూర్చోబెట్టాడు.

సీట్లో కూర్చున్నా వొరిగిపోతోంది కలుగోలమ్మ.

సాంబయ్య రిక్షా ఎక్కి తొక్కుతున్నాడు.

కలుగోలమ్మకు మూసిన తలుపులు తనకు వీడ్కోలు పలుకుతున్నాయి.

కలుగోలమ్మను చూస్తుంటే సాంబయ్య మనసుకు ఆందోళనగా వుంది.

"జాగ్రత్తగా కూర్చోండమ్మా. పది నిమిషాలలో ఇంటికి చేరతాం" అంటూ సీటులో నుంచి వాలి పడిపోబోతున్న కలుగోలమ్మను రిక్షా ఆపి దిగి సీట్లో తిరిగి కూర్చోబెట్టాడు.

కలుగోలమ్మను చూస్తుంటే భయం కలుగుతోంది సాంబయ్యకు. కలుగోలమ్మ పెద్ద కొడుకు చంద్రం ఇంటి ముందు రిక్షా ఆపాడు.

చంద్రం ఇంటి వైపు చూశాడు సాంబయ్య.. తలుపులు మూసి వున్నాయి.

"అయ్యా! నేను సాంబయ్యను, తలుపు తియ్యండి" అంటూ తలుపు తడుతున్నాడు.

తలుపు దగ్గరే నిలబడి రిక్షా వైపు నడిచాడు. అచేతనంగా వున్న కలుగోలమ్మను రెండు చేతులతో కదుపుతున్నాడు.

సాంబయ్యకు అర్థమయ్యింది. తల ఎత్తి చూశాడు. చంద్రం ఇంటి తలుపులు మూసే వున్నాయి.

రిక్షా సీటుపై నిశ్చలంగా వున్న ప్రేమ మూట నుండి నిరంతరాయంగా ప్రసరిస్తున్న ప్రేమకిరణాలు సాంబయ్య మనసును అకలా వికలం చేస్తోంది. ●

(గత వారం తరువాయి..)


వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458




# రెండు వరసల మెట్లు నిర్మించాలంటే?

## వాయువ్యంలో రెండు వరుసల మెట్లు

రెండు వరుసల మెట్లు వాయువ్యంలో నిర్మించవలసి వస్తే ఉత్తర వాయువ్యంలో గానీ, పశ్చిమ వాయువ్యంలోగానీ నిర్మించవచ్చు.

ఉత్తర వాయువ్యంలో మెట్ల నిర్మాణం చేస్తే మెట్ల వెడల్పును అనుసరించి ఆరు లేక ఏడు అడుగుల ఖాళీ స్థలం వుండటం తప్పనిసరి. అక్కడ మెట్ల నిర్మాణం తర్వాత ఉత్తర కాంపౌండు గోడ నుండి మెట్ల వరకు కనీసం ఒక అడుగయినా ఖాళీ స్థలం వదలడం తప్పనిసరి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉత్తర కాంపౌండు గోడను ఆనుకొని మెట్లు నిర్మించకూడదు. అలా నిర్మించడం వలన ఉత్తర కాంపౌండు గోడ మీద భారం అధికమై చెడు ఫలితాలు కనిపిస్తాయి.

## మెట్ల కింద నిర్మాణాలు..

చాలా మంది మెట్ల లాండింగ్ కింద లెట్రిన్, బాత్‌రూములుగానీ, స్టోర్ రూమ్‌గానీ చాలామంది కడుతూ వుంటారు. అది సరైన పద్ధతి కాదు. ఇంటి స్వరూపంలో ఉత్తర వాయువ్యం పెరిగినట్టయి, ఉత్తర వాయువ్యం పెరగటం వలన కలిగే చెడు పరిణామాలు అంటే కోర్టు వ్యవహారాలు, చెడు అలవాట్లు, వ్యవహారాల్లో అపజయాలు లాంటివి జరుగుతూ వుంటాయి.

మెట్ల నిర్మాణం ఇంటి పశ్చిమ గోడను ఆనుకుని దక్షిణ గోడకు పారుగా లాండింగ్ జరగాలి. అంతేగానీ పశ్చిమ వాయువ్యం ప్రహరీగోడ మీదకు లాండింగ్ తీసుకువెళ్లకూడదు.

మెట్లు ఎక్కేటప్పుడు పశ్చిమాభిముఖంగా ముందు ఎక్కి ఆ తరువాత లాండింగ్ పైన దక్షిణానికి తిరిగి తూర్పు వైపుగా మెట్లు ఎక్కి బాల్కనీలోకి నడిచి ఉచ్ఛ స్థానమయిన ఉత్తర ఈశాన్య ద్వారం గుండా పై పోర్షన్‌లోకి అడుగిడాలి.

ఇంటి గోడనానుకుని వున్న రెండున్నర లేక మూడు అడుగుల వెడల్పుతోగానీ లేక మొత్తం రెండు వరసల మెట్ల వెడల్పు అయినా అయిదు లేక ఆరు అడుగుల వెడల్పుతోగానీ బాల్కనీ వేయాలి.

ఉత్తరాన ఎంత వెడల్పు బాల్కనీ వేస్తామో అంతకంటే తక్కువ వెడల్పుతో దక్షిణాన బాల్కనీ వేయాలి. దక్షిణాన బాల్కనీ వేయకపోయినా ఫరవాలేదు. అవసరమైతే మాత్రం పైన చెప్పినట్టే వేయాలి.

ఈ మెట్ల కింద యింటి నుండి బయటకు వచ్చే తలుపునుగానీ, మెట్లకెదురుగా ఉత్తర వాయువ్యంలో కాంపౌండు, గోడకు గేటునుగానీ అమర్చకూడదు. మామూలుగా అలా ద్వారాలుగానీ, గేట్లుగానీ పెట్టడం వలన విపరీత ధననష్టం, పనుల్లో అపజయం, వ్యవహారాల్లో స్వతంత్రం లోపించటం వలన పనులెక్కడికక్కడ ఆగిపోవడం జరుగుతూ ఉంటుంది.

అదే మెట్లకు అడ్డంగా ఆ స్థానాల్లో తలుపులు గానీ, గేట్లుగానీ వుంటే అవే ఫలితాలు మరింత తీవ్రంగా కలిగి మనస్థాపాన్ని కలిగించటమే గాక ఒక్కోసారి మానసిక చాంచల్యానికి కూడా దారితీసే ప్రమాదం ఉంటుంది. అక్కడ గేట్లు, తలుపులూ వుండి వాయువ్య మూలలో దక్షిణ, పశ్చిమ గోడలను ఆనుకొని ఏదైనా గది కట్టడం వలన లేదా బాత్‌రూములు, టాయ్‌లెట్లు కట్టడం వలన ఆ ఉత్తర వాయువ్యం పూర్తి దోషపూరితమవుతుంది. తద్వారా కలిగే దుష్ఫలితాల వలన యింటి యజమానిగానీ, ఆ యింటి కిరాయిదారుగానీ, వాళ్ల కుటుంబ సభ్యుల్లో ఎవరయినాగానీ, అనేక కారణాల వలన విపరీత మనస్థాపాన్ని చెంది యిల్లు వదిలి వెళ్లిపోవటంగానీ, దేశ దిమ్మరులయి యింటి ధ్యాస మరిచేవారుగానీ, సన్యాసం స్వీకరించి కుటుంబాన్ని విస్మరించటంగానీ జరుగుతుంది. ఇంటిని వదిలి వెళ్లినవారు వేరేచోట ఎక్కడున్నా ఆ యింటి వాస్తు ప్రభావంగానీ, ఈ ఇంటి వాస్తు చెడు ప్రభావం కంటే ఎంతో ఉత్తమమైనదయి వుంటే అభివృద్ధి పథం వైపు నడిచి సంపాదనాపరులయ్యే అవకాశం కూడా వుంది.

కానీ విధిలిఖితం అయితే తప్ప అంతటి ఉత్తమ గృహాల్లో బస చేయటం జరగని పని. అదే నిజంగా జరిగితే ఆ వ్యక్తి నిస్సందేహంగా అదృష్టవంతుడనే చెప్పవచ్చు.



అదృష్టం బాగున్నవాడు చెడు వాస్తు ప్రభావం వున్న యింట్లో వుండటానికి ఇష్టపడక బయటకెళ్లి బాగుపడటం ఎలాంటిదో; దురదృష్టవంతుడు చెడు ప్రభావం వున్న యింటి నుండి బయట పడ్డా ఆ వాస్తు దుష్ప్రభావం అతన్ని వెంటాడటం అలాంటిదే. అందుకే 'దిశను బట్టి దశ మారటం' ఎంత సత్యమో 'దశను బట్టి దిశ మారటం' కూడా అంతే సత్యం.

# జీవితం సహజంగా సాగిపోవాలి

**ఆయన గ్రీకు దేశపు రాజు. ఆయన ఓ విచిత్రమైన మనస్తత్వం గల రాజు. పంతాలెక్కువ. పిచ్చితనమూ ఉంది. ఈ రెండు కలిసిన మనిషి వైఖరి ఎలా ఉంటుందో చెప్పనవసరం లేదు.**

ఆ రాజు దగ్గర ఓ అందమైన మంచం ఉంది. అది అచ్చంగా బంగారంతో చేసిన మంచం. వజ్రాలు పొదిగిన మంచం. అందులో కాస్తంత కొయ్య కూడా లేదు. వజ్ర వైఢూర్యాలు సరేసరి. అంతటి విలువైన, ఖరీదైన మంచం గ్రీకు దేశంలో మరెవరి దగ్గరా లేదు. ఉండటానికి వీల్లేదని కూడా ఆదేశాలు జారీ చేశాడు రాజు. అది అంతటి అపూర్వమైన మంచమన్న మాట.

ఆ రాజుకు తనకంటూ కొన్ని ఆశయాలు ఉన్నాయి. తన కోటకు ఎవరైనా ముఖ్యమైన అతిథులు వస్తే వారిని ఆ బంగారు మచంలో పడుకోనిచ్చేవారు. కానీ ఒక విషయం. వచ్చిన అతిథి ఎత్తు ఆ మంచానికి సరిగ్గా సరిపోవాలి. పడుకున్నప్పుడైనా సరే కాళ్లు జాపుకునే పడుకోవాలి.

ముడుచుకుని పడుకోవడానికి వీల్లేదు. అలా పడుకోలేకపోతే వెంటనే మంచంలో నుంచి కిందకు దింపేసేవాడు రాజు. ఒకవేళ అతిథి ఎత్తు మంచం పొడవు కన్నా ఎక్కువ ఉంటే వారి కాళ్లు కోసేయమంటాడు. ఎందుకంటే ఆ మంచం ఖరీదైనది. కనుక దానిని మార్చడం కుదరదు. అందువల్ల మంచానికి తగినట్టు అతిథిని మార్చేస్తాడన్నమాట. ఆ రాజుకి మంచం ముఖ్యమే తప్ప అతిథి కాదు. అలా పలు సమయాలలో మనలో చాలా మందికి జీవితం ముఖ్యమైనదిగా అనిపించదు. ఆశయాలు, ప్రణాళికలు ముఖ్యమైనవిగా అనిపిస్తాయి.

సాధారణంగా ఓ కొలత మేరకు మంచం తయారు చేయడం అన్నది ఎక్కడైనా జరిగే పనే. ఉదాహరణకు పది మంది ఎత్తుని కొలిచి ఆ ఎత్తుని పదితో విభజించగా వచ్చే సంఖ్యకు అనుగుణంగా ఆ మంచాన్ని తయారు చేయించాడు ఆ రాజు. అయితే సరాసరి ఎత్తు అంటూ ఉండొచ్చు. కానీ అది మంచం విషయంలో సరికాకపోవచ్చు కదా. కానీ అదంతా రాజుకి అనవసరం. తాను ఏదైతే అనుకుంటాడో అలాగే ఆ మంచాన్ని తయారు చేయించాడు. అటువంటప్పుడు ఆ మంచానికి సరిపోయే ఎత్తుకు ఏ అతిథి ఉంటాడో ఆలోచించండి. అది అసలు జరిగే పనేనా? సరే..!

ఆ మంచం పొడవుకి కాకుండా అతిథి కాస్తంత తగ్గాడనుకోండి. అతని విషయంలోనూ ఊరుకోడు రాజు. తన కోటలో కొందరు బలశాలులను ఉంచుకున్నాడు. వారిని పిలిపిస్తాడు. వచ్చిన అతిథి చేతుల్ని కట్టించేస్తాడు. తల దగ్గర నలుగురు, కాళ్ల దగ్గర నలుగురు ఆ అతిథిని పట్టుకుని లాగిస్తాడు. ఈ విధంగా అతిథి దేహాన్ని సాగించమంటాడు. కానీ అతను మనిషే. కానీ ఓ తీగో, రబ్బరో కాదుగా.. సాగదీయడానికి. కానీ రాజుకి అదంతా అనవసరం. వచ్చిన అతిథి ఆ బంగారం మంచం మీద హాయిగా పడుకోవాలన్నదే ఆ రాజు ఆశ. కానీ అది ఇలా విపరీతంగా ఉండటం వల్లే చిక్కంతా. కానీ అది ఆ రాజు తప్పు కాదనీ, క్రమశిక్షణ తప్పనీ అంటున్నారు ఓషో.



జీవితాన్ని ఓ క్రమశిక్షణలో కొనసాగించడమన్నది వేరు. నియంత్రించడం అన్నది వేరు. క్రమశిక్షణ పేరుతో చాలా మంది జీవితాన్ని కోల్పోతారు. జీవితంలోని ఆనందం సహజమైనదిగా ఉండాలి తప్ప బలవంతంగా తెచ్చిపెట్టుకోవడం కాదు. ఆ ఆనందం పొందాలంటే మనసు విప్పారి ఉండాలి. ఇది తెలియకపోవడం వల్లే పలు సమస్యలు తలెత్తుతుంటాయి.

.........

మనలో కొందరి తీరు వేరు. అదొక ఆస్పత్రి. ఆపరేషన్ అయిపోయింది. ఆ తర్వాత నర్సు పరిగెత్తుకుంటూ డాక్టరు వద్దకు కంగారు పడుతూ వచ్చింది.

"ఏమిటి... ఏమైంది?" అని అడిగాడు డాక్టరు.

"డాక్టర్! మీరు ఇప్పుడు ఆపరేషన్ చేసారు కదా! ఆ రోగికి నిజానికి కాలిలో పుండు. కానీ మీరు, తలకు ఆపరేషన్ చేశారు. మెదడుకి ఆపరేషన్ చేయాల్సిన పేషెంట్ పదిహేనో వార్డులో ఉన్నాడండి" అంది.

డాక్టరు ఆలోచించారు..

"ఫరవాలేదులే. దానికెందుకు అంత కంగారు? ఇప్పుడు ఆపరేషన్ చేసిన రోగిని తీసుకెళ్లి పదిహేనో నంబరు మంచం మీద పడుకోపెట్టేసి, ఆ మంచం మీదున్న రోగిని తీసుకువచ్చి ఇక్కడ పడుకోబెట్టు. అంతే!" అన్నాడు డాక్టర్ తాపీగా.

**- యామిజాల జగదీశ్**

# పావనప్రదం 'పాలంక' సందర్శనం



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో సుమారు అయిదు వేల కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంటాయి దట్టమైన నల్లమల అడవులు. ఈ అరణ్యాలలో ఎన్నో రకాల వృక్షాలు, ఔషధాలు లభ్యమవుతాయి. స్థానిక అడవి పుత్రులు తమ జీవనోపాధిని వీటి ద్వారానే పొందుతారట. అరణ్యంలో ఎన్నో గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఈ అడవులలో మూడు వేల కిలోమీటర్ల మేర పెద్ద పులుల రక్షిత ప్రాంతంగా ప్రకటించారు. ఎన్నో వాగులు, వంకలు, చెరువులు, గుండాలు ఈ అరణ్యాలలో కనిపిస్తాయి.

ఈ పర్వతాలు, అరణ్యాలు విశేష ఆలయాలకు నిలయాలు. వీటిలో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుడు కొలువైన తిరుమల, శ్రీ నారసింహుడు కొలువైన నవ క్షేత్రాల అహోబిలం, శ్రీ భ్రమరాంబా సమేత శ్రీ మల్లికార్జున స్వామి కొలువైన శ్రీశైలం ప్రముఖమైనవి. ఇవి కాకుండా గుండ్ల బ్రహ్మేశ్వరం, నెమలి గుండ్ల రంగనాయక స్వామి ఆలయం, శ్రీ మాలకొండ, ఇష్టకామేశ్వరి అమ్మవారి దేవాలయం, మల్లెల తీర్థం, శ్రీ లొద్ది మల్లయ్య, సలేశ్వరం, శ్రీ ఉమామహేశ్వర ఆలయం, గవి మల్లేశ్వర స్వామి గుహలు, నిత్యపూజకోన.. ఇలా బాహ్య ప్రపంచానికి అతి తక్కువగా పరిచయమైన క్షేత్రాలు చాలా ఈ అరణ్యాలలో ఉన్నాయి.

అయితే ఈ క్షేత్రాలను ఎప్పుడు కావాలంటే అప్పుడు సందర్శించుకోలేం. ఎందుకంటే కొన్ని ప్రదేశాలలో శనివారంనాడు మాత్రమే భక్తులకు దర్శనం లభిస్తుంది. మరికొన్ని చోట్ల శివరాత్రికి, కొన్ని చైత్ర పౌర్ణమికి, మరికొన్ని చోట్ల తొలి ఏకాదశికి అక్కడ కొలువైన దేవీ దేవతలను సందర్శించుకోవచ్చు.

ఈ ప్రాంతాలకు చేరుకోవడానికి ఎన్నో వ్యయ ప్రయాసలకు తట్టుకోవాలి. రక్షిత అరణ్యాలు కావడం వల్ల అటవీశాఖ వారి అనుమతి కావాలి. లేదా వారు ప్రకటించే రోజులలో వెళ్లాలి. సరైన మార్గం ఉండదు. అధిక శాతం కొండ గుట్టలలో, లోయలలో నడిచి వెళ్లాలి. రహదారి ఉన్నా మన వాహనాలు వెళ్లలేవు. స్థానికంగా అనుమతి ఉన్న జీపులలో ప్రయాణించాలి. ఖరీదు చాలా ఎక్కువ ఉంటుంది. ప్రయాణం కొద్ది ఇబ్బందికరమైనా ప్రకృతి సౌందర్యం అలరించి మైమరిపిస్తుంది. అన్ని చోట్లా విరివిగా అన్నదానం జరుగుతుంది.

తొలి ఏకాదశినాడు మాత్రమే సందర్శించగలిగిన క్షేత్రాలలో మొదటిది శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి కొలువైన పాలంక. ఈ క్షేత్రం చేరుకోవడానికి ముఖద్వారం యర్రగొండపాలెం. వినుకొండ, మార్కాపురం, కర్నూలు, శ్రీశైలం, విజయవాడ, హైదరాబాద్, మహబూబ్‌నగర్‌ల నుండి చేరుకోవడానికి బస్సు సౌకర్యం లభిస్తుంది.

యర్రగొండపాలెం నుండి పాలంక అరవై కిలోమీటర్లు. ఈ ప్రయాణంలో తొలి మజిలి 'గంజివారి పల్లి' పదిహేను కిలోమీటర్ల దూరం. అక్కడి వరకు చక్కని తారురోడ్డు. గ్రామం దాటిన తరువాత ఉన్న స్వాగత ద్వారం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్ దగ్గర వచ్చీ, పోయే వాహనాల వివరాలను తెలపాలి. చుట్టుపక్కల ఉన్న గ్రామాల వారు మోటారు సైకిళ్ల పైన వెళుతుంటారు. గంజిపల్లి నుండి దారి సరిగ్గా ఉండదు. దీనిని అటవీ అధికారులు తమ పర్యవేక్షణ నిమిత్తం ఏర్పాటు చేసుకొన్నారు. అరణ్యంలో నివసించే అడవి బిడ్డలకు కూడా ఇదే ప్రధాన దారి. మట్టిరోడ్డు, గుంతలు, గోతులతో నిండి ఉంటుంది. దారికి రెండు వైపులా పెద్దా, చిన్న రాళ్లు, ముళ్లపొదలతో నిండి ఉంటాయి. వాహనాల రాకపోకలతో లేచి ఎర్రటి దుమ్ము వాహనాలను, మనుషులను ఆవరిస్తుంది.

ఈ మార్గంలో వచ్చే రెండో మజిలీ 'పెద్దమ్మతల్లి చెక్‌పోస్ట్'. చిన్న చెంచుల గ్రామం. అటవీశాఖ వారి కార్యాలయం, చిన్నగా కనపడే పెద్దమ్మతల్లి కొలువైన గద్దె ఉంటాయి. అన్ని ఇళ్లకీ, కార్యాలయాలకీ సోలార్ పానల్స్ అమర్చారు. రక్షిత ప్రాంతం కావడాన విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయడం ఒక సమస్య కాకుండా ఉండడానికి ఈ ఏర్పాటు. స్థానికుల తాగునాటి సౌలభ్యం కోసం ఏర్పరచిన బోరుపంపులకు కూడా సోలార్ పానల్స్ ఏర్పాటు చేశారు. మరొక పోలీస్ చెక్‌పోస్ట్ ఉంటుంది. ఇక్కడ కూడా వాహన వివరాలను తెలపాలి. ఇక్కడి నుండి దారి మరికొంత ఇబ్బందికరంగా ఉంటుంది. కారణం.. దర్శనం చేసుకొని తిరిగివచ్చే వాహనాల సంఖ్య కూడా పెద్దగానే ఉంటుంది. సన్నని దారిలో వచ్చిపోయే వాహనాల కదలిక చాలా నెమ్మదిగా ఉంటుంది. చుట్టూ పచ్చని పరిసరాలు, స్వచ్ఛమైన గాలి, వర్షాకాలంలో నీటి ప్రవాహం మూలంగా ఏర్పడిన తాత్కాలిక జలప్రవాహాల గుర్తులు మనల్ని ప్రకృతితో మమేకం చేస్తాయి.

నారు తడికల పెంట మూడో చెక్‌పోస్టు. వాహనాల నమోదు తప్పనిసరి. ఇన్ని చెక్‌పోస్టులను పెట్టడానికి కారణం ఇవి రక్షిత వనాలు కావడమే. పెద్ద పులులు తిరిగే ప్రాంతం. వాటి వలన మనుషులకు, మనుషుల కారణంగా వాటికి ఎలాంటి ప్రమాదం కలగకుండా ఉండటానికి తీసుకునే జాగ్రత్తలలో ఇది ఒకటి.

నారు తడికల పెంట పర్వత పై భాగాన ఉంటుంది. పాలంక ఎనిమిది కిలోమీటర్ల దూరంలో లోయలో ఉంటుంది. నడిచి నడిచి ఏర్పడిన దారిలో కిందకు దిగాలి. పై నుండి చూస్తే ఎదురుగా అర్ధ చంద్రాకారంలో ఉన్న కొండపై భాగంలో నీరు ప్రవహిస్తూ ఉంటుంది. వానాకాలంలో నీటి ప్రవాహా వేగం కూడా ఎక్కువగా ఉంటుంది. ఆ కాలంలో పైనుండి కిందకు వేగంగా జాలువారే నీటి ప్రవాహా అందం వర్ణించలేం. అలా జాలువారిన నీటితో కింద పెద్ద సరస్సు ఏర్పడింది.



చారిత్రక నేపథ్యం దక్షిణాదిన ఉన్న రాజ్యాలను జయించిన విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు తన రాజధాని హంపికి తిరిగి వెళుతూ ఇక్కడ విడిది చేశారట. చుట్టూ దట్టమైన అడవి. ఒక పక్కన నిరంతరం పై నుండి జాలువారే జలపాతం, ఆ నీటి ధారల వలన కింద ఏర్పడిన పెద్ద చెరువు ఆయనను ఆకర్షించాయట. అక్కడి చెంచులు రాయల వారికి చక్కని ఆతిథ్యాన్ని అందించారట. సంతృప్తి చెందిన చక్రవర్తి వారిని ఏమి కావాలో కోరుకోమన్నారట. వారు కృతజ్ఞతలు తెలిపి, తమ ఆరాధ్య దైవం అయిన శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామివారి ఆలయాన్ని ఒకటి నిర్మించమని అభ్యర్థించారట. ఆలయాల నిర్మాణాల పట్ల అమిత ఆసక్తి గల శ్రీకృష్ణ దేవరాయలు వారి కోరికను తీర్చడానికి అంగీకరించి శిల్పులను నియమించారట. జలపాత ధారల ద్వారా ఏర్పడిన తీర్థం పక్కన నియమించాలన్న నిర్ణయానికొచ్చారట శిల్పులు. కొండ కింద భాగాన్ని అర్ధ చంద్రాకారంలో గొడుగులాగా మలచి కింద స్థానికుల దైవాన్ని ప్రతిష్ఠించినట్లు తెలుస్తోంది. తదనంతర కాలంలో శ్రీ లింగరాజు, శ్రీ పంచముఖేశ్వర, శ్రీ మహిషాసుర మర్దని అమ్మవార్లను స్థానికులు ప్రతిష్ఠించుకున్నారు. తమ కోరిక తీరడంతో ఆనందించిన చెంచులు తామే పూజారులుగా వ్యవహరిస్తూ స్వామివారికి నిత్యపూజలు చేయసాగారు. అనతి కాలంలోనే స్వామివార్ల మహిమ మిగిలిన పల్లెలకు, అడవికి వెలుపల ఉన్న పట్టణ ప్రాంతాలకు పాకింది. అరణ్యంలో సహజ వాతావరణానికి భంగం కలగకుండా, వన్యప్రాణులకు హాని కలగకుండా ఉండటానికి సంవత్సరంలో మూడు రోజుల పాటు క్షేత్రంలో పూజలు, కొలుపులు జరిపించాలని పెద్దలు నిర్ణయించారు. దానికి వారు ఎంచుకొన్న సమయం తొలి ఏకాదశి. ఆ రోజు నుండి మూడు రోజులు జరిపే పూజలకు మాత్రమే అందరినీ అనుమతించాలని నిశ్చయించారట. నాటి నుండి నేటి దాకా ఆ నియమం అమలు అవుతోంది. పాల లాంటి స్వచ్ఛమైన తెల్లని నీటిని జాలువార్చే జలపాతం ఉన్న ప్రదేశంగా 'పాలవంక' అని పిలిచేవారట. కాలక్రమంలో అదే 'పాలంక'గా మారిందని అంటారు. తొలి ఏకాదశి ముందు రోజు నుండి నాలుగు రోజుల పాటు వేల సంఖ్యలో వాహనాలు పాలంక వస్తుంటాయి. జలధార, సరస్సు చుట్టూ ఒక తాత్కాలిక గ్రామం ఏర్పడుతుంది. అక్కడే వంటలు, పడక అన్నీ! వచ్చిన వారందరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్నప్రసాదం అందిస్తారు.

రాత్రిపూట భక్తిపూరితమైన నాటకాలు, నాటికలు ఏర్పాటు చేస్తారు. కొండ పైన కిందకు దిగే చోట శ్రీ అంజనాసుతుని సన్నిధి వద్ద కూడా పెద్ద ఎత్తున పూజలు జరుగుతుంటాయి.

కొండ కింద అయితే చెప్పనవసరం లేదు. మూడు రోజులు ఉండేవారు, ఎప్పటికప్పుడు వచ్చి వెళ్లేవారితో శ్రీ వీరభద్ర, శ్రీ భద్రకాళీ సన్నిధులతో పాటు మిగిలిన దేవతలు ఆలయాల వద్ద భక్తుల సందడి ఎక్కువగా ఉంటుంది.

కోయ లేక చెంచు పూజారుల ఆధ్వర్యంలో అనేక రకాల పూజలు జరుగుతుంటాయి. ప్రాంగణం అంతా కొబ్బరి చిప్పలు, పసుపు-కుంకుమ వెదజల్లినట్లుగా కనపడతాయి. వాటినే భక్తులు ప్రసాదంగా భక్తిభావాలతో తీసుకొని వెళుతుంటారు.

పాలంక క్షేత్రంలో ఒక చిత్రమైన పరీక్ష కనపడుతుంది. అది అందరికీ కాదు. బిడ్డలు లేని దంపతులకు మాత్రమే. గుహ మొదట్లో పై భాగాన ఒక నల్లటి లింగాకారంలో ఉండే ఆకారం కనబడుతుంది. అక్కడ నుండి ఒక్కో చుక్క కిందకు పడుతుంటాయి. సరిగ్గా దాని కింద ఒక పీఠం లాంటిది నిర్మించారు. సంతానం లేని భార్యాభర్తలు గుండంలో స్నానం చేసి శుచిగా వచ్చి అక్కడ కూర్చుంటారు. కోయ పూజారి మంత్రాలు చదివి వారి అరచేతులలో పసుపు, కుంకుమ పెడతాడు. అక్కడ నుండి వారు అలాగే అరచేతులు చాపి కూర్చోవాలి. నిర్ణయించిన సమయం లోపల నీటిచుక్క వారి చేతుల్లో పడితే సంతానం కలుగుతుంది. లేకపోతే సంతానం కలగదు అని విశ్వసిస్తారు.

ఈ నీటి బిందువు జోస్యం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో నిలబడతారంటే దాని పట్ల వారికి గల విశ్వాసం ఎలాంటిదో అర్థం చేసుకోవాలి.

పాలంక నుండి భక్తులు అడవిలో కాలి నడకన కొండ పై నుండి పాలుట్ల, నెక్కంటి, శ్రీ ఇష్టకామేశ్వరీదేవి ఆలయం మీదుగా శ్రీశైలం చేరుకొంటారు. మరికొందరు మరో మార్గంలో అడవిలో నడుచుకొంటూ మద్దిమడుగు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం దగ్గరకు వెళతారు. రెండూ పాతిక కిలోమీటర్ల దూరం ఉంటాయి. ఈ రెండు మార్గాల్లో ఈ రెండు రోజులు మాత్రమే భక్తులను అనుమతిస్తారు.

కొండ కింద మొత్తం ఆరు నిర్మాణాలుంటాయి. అయిదు ఆలయాలు, ఒకటి కార్యాలయం. శ్రీ గణపతి, శ్రీ లింగరాజు, శ్రీ పంచముఖేశ్వరుడు, శ్రీ మహిషాసుర మర్దని ఆలయాలతో పాటు ప్రధాన అర్చనామూర్తి అయిన శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి కొలువైన సన్నిధి ఉన్నాయి. ఈ ఆలయం కొద్దిగా పెద్దగా ఉంది. ఎదురుగా నందీశ్వరుడు, పక్కనే ధ్వజస్తంభం ఉంటాయి.

భక్తులు ఇక్కడికి వచ్చి మొక్కుకొని ఫలితం పొందాక తిరిగి మరుసటేడు దర్శనానికి రావడం రివాజు. వచ్చిన ప్రతిసారీ ఒకటి లేక మూడు రోజులు నిద్ర చేస్తారు భక్తులు. నిద్ర చేయడం వలన కోరికలు ఫలిస్తాయని వారి నమ్మకం. వచ్చిన ప్రతి సంవత్సరం వచ్చే యాత్రికులకు అన్నదానం చేయడం వారందరికీ ఆనవాయితీ. సాహస, ఆధ్యాత్మిక యాత్ర చేయాలనుకొనేవారు తప్పనిసరిగా దర్శించవలసిన వాటిల్లో ముఖ్యమైనది పాలంక.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. కోర్టు సమస్యలు పరిష్కారమయ్యే సూచనలున్నాయి. విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. దూర దేశ ప్రయాణ సూచనలున్నాయి. ఉద్యోగులకు పని వత్తిడి ఉంటుంది, సంయమనంతో వ్యవహరించడం చెప్పదగిన సూచన. అనుకోని సంఘటనలు జరిగే అవకాశాలున్నాయి. వృథా కాలక్షేపం చేస్తారు.

## వృషభం



ఉద్యోగ ప్రయత్నం ఫలిస్తుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరి మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఆర్థిక ఇబ్బందులున్నా సమయానికి ఏదో విధంగా సర్దుబాటు చేసుకుంటారు. విందు-వినోదాల్లో పాల్గొంటారు. ప్రతికూలతలు వున్నా పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి రంగాల్లో వున్నవారు రుణాలు తీరుస్తారు. విందు-వినోదాల్లో పాల్గొంటారు.

## మిథునం



ప్రయాణం లాభిస్తుంది. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఊహించని ధన ప్రాప్తి. వ్యాపారులు రుణాలు చేయాల్సి వస్తుంది. మిత్రులతో మనస్పర్థలు. సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది. వృత్తి రంగాల్లో వున్నవారికి సామాన్యంగా ఉంటుంది. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. ఉద్యోగులకు ఆర్థికంగా ఆశించిన ఫలితాలుంటాయి.

## కర్కాటం



ఉద్యోగులకు బాగుంటుంది. వృత్తి రంగాల్లో వున్నవారికి ఆర్థికంగా బాగుంటుంది. కుటుంబంలో సమస్యలుంటాయి. ధర్మ రక్షణకై పాటుపడతారు. క్రయ-విక్రయాలు యథాతథంగా ఉంటాయి. ప్రభుత్వ సంబంధమైన వ్యవహారాలు వారాంతంలో పూర్తవుతాయి. స్త్రీలకు శుభ యోగం. కళాకారులకు కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. ఆలోచనలు ఫలిస్తాయి.

## సింహం



ప్రతికూలతలున్నా ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సమస్యలు తీరి మానసిక ప్రశాంతత ఏర్పడుతుంది. క్రయ-విక్రయాలు యథాతథంగా ఉంటాయి. బ్యాంకు రుణాలు మంజూరవుతాయి. గృహ సౌఖ్యం. కోర్టు వ్యవహారాలు సానుకూలంగా ఉంటాయి. విద్యా, వివాహ సమస్యలు పరిష్కారమవుతాయి. ఆరోగ్య సమస్యలుంటాయి.

## కన్య



దుర్వ్యసనాలకు దూరంగా వుండాలని దృఢ నిశ్చయం చేసుకుంటారు. వృత్తి రంగాల్లో వున్నవారికి ఆశించిన ఫలితాలు ఉండకపోవచ్చు. కొత్త విషయాలు తెలుసుకుంటారు. ఇష్టమైన పనులు పూర్తి చేస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. రుణాలు తీర్చడంలో ఇబ్బందులుంటాయి. వృథా సంచారం చేస్తారు. ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది.

## తుల



ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. బంధు, మిత్రులతో మనస్పర్థలకు ఆస్కారం. సహనంతో వ్యవహరించడం మంచిది. వివాదాలకు దూరంగా ఉండండి. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వ్యాపారులు గృహం/భూమి కొనుగోలు సూచనలున్నాయి. అకారణంగా మానసిక వత్తిడికి లోనవుతారు. ఉద్యోగాభివృద్ధి ఆశించిన మేరకు ఉంటుంది. వ్యాపారులకు పోటీ అధికమవుతుంది. ప్రయాణం లాభిస్తుంది.

## వృశ్చికం



శారీరక శ్రమ అధికం. ప్రముఖులను సందర్శిస్తారు. వృత్తి రంగాల్లో వున్నవారికి ఖర్చులు అధికం. బంధు, మిత్రులతో మనస్పర్థలకు అవకాశం. ఉద్యోగ ప్రయత్నం ఫలిస్తుంది. ఉత్సాహంగా గడుస్తుంది. సాహిత్య సభలు, సమావేశాలకు హాజరవుతారు. వాహన యోగం. దంపతుల మధ్య మనస్పర్థలు తీరుతాయి. విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. శుభ కార్యాలకు అనుకూల సమయం.

## ధనుస్సు



క్రయ-విక్రయాలు ఆశించిన ఫలితాలనిస్తాయి. రుణాలు తీరుస్తారు. దీర్ఘకాలిక సమస్యలు తీరి మానసిక ప్రశాంతత లభిస్తుంది. వృత్తి రంగాల్లో వున్నవారికి పోటీ అధికం. శుభ కార్యాల్లో పాల్గొంటారు. మొండి బకాయిలు వసూలవుతాయి. ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలనం. దుర్వ్యసనాలకు దూరంగా వుండాలని దృఢ నిశ్చయం చేసుకుంటారు. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి వస్తుంది.

## మకరం



వృత్తి విద్యలు అభ్యసించిన వారికి అవకాశాలు అధికం. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రుణాలు చేయాల్సి వస్తుంది. శుభ కార్యాలకు హాజరవుతారు. కుటుంబ సౌఖ్యం. ఉద్యోగులకు ఉన్నతాధికారుల వత్తిడి ఉంటుంది. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. ఎదురు చూస్తున్న శుభ సమాచారం అందుకుంటారు. గతంలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభించి వారాంతంలో పూర్తి చేస్తారు.

## కుంభం



వృత్తి ఉద్యోగాల్లో వున్నవారికి సామాన్య ధన లాభం. సామాజిక సంఘర్షణకు లోనవుతారు. సహనంతో వ్యవహరించడం అన్ని విధాలా మంచిది. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. కుటుంబంలో స్వల్ప తగాదాలుంటాయి. ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. క్రయ-విక్రయాలు యథాతథంగా ఉంటాయి. ముఖ్యమైన నిర్ణయాలు అమలు.

## మీనం



ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. సామాన్య ధన లాభం. విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు తీరి మానసిక ప్రశాంతత ఏర్పడుతుంది. తీర్థ యాత్రలు చేయాలన్న కోరిక తీరుతుంది. బంధు, మిత్రులను కలుసుకుంటారు. సోమరితనం దరి చేరనివ్వకండి. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు పెద్దలను/అనుభవజ్ఞులను సంప్రదించడం శ్రేయస్కరం.

# మనసుకు నచ్చిన పాట

'బలగం' సినిమాలో 'ఊరు పల్లెటూరు–దీని తీరే అమ్మతీరు' అనే పాట కాసర్ల శ్యామ్ మంచి రచనల్లో ఒకటి. భీమ్స్ సిసిరోలియో చక్కటి సంగీతం అందించారు. జబర్దస్త్ వేణు దర్శకత్వ ప్రతిభతో వేణు ఎల్దిండిగా మారి ఇంటిపేరు నిలబెట్టాడు. ఆచార్య వేణు ఫొటోగ్రఫీ ప్లస్ పాయింట్. మంగ్లి హైపిచ్, రామ్ మిరియాల పంటిబిగువు విరుపుతో తనదైన స్టైల్లో పాడారు. మొగిలయ్య పాత్రలో కేతిరి సుధాకర్ రెడ్డి జీవించాడు. వెరసి ఈ పాట ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయింది.

**మంచి సినీ పాట రచయిత:** సినిమాలో సందర్భానికి తగినట్లు రాయడం ప్రథమ కర్తవ్యం. ఆ పాట కథలో ఒక భాగమైపోవాలి. ప్రజల నాలుకల మీద నిలబడటం కొన్ని పాటలకే సాధ్యమవుతుంది. ఈ అర్హతలన్నీ ఉన్న పాట ఇది. గ్రామాల్లో సర్వసాధారణంగా వాడే పదాల్లో కొన్ని బూతుపదాలు దొర్లుతుంటాయి. మాటలో ఉంటుందేమో కానీ భావంలో కాదు. అలాంటి పదమే నీయక్క. గ్రామాల్లో అన్నా, అక్కా, అవ్వా, తాతా అని బంధుత్వాలు కలుపుకొని మాట్లాడటం చూస్తూ వుంటాం.పట్టణాల్లో ముక్తసరిగా 'గుడ్ మార్నింగ్' చెప్పినట్లు పల్లెల్లో ఉండదు. ఆప్యాయంగా పలకరించుకొంటారు. కొంతమంది వ్యంగ్యంగా పలకరిస్తారు. అలాంటివాడే మొగిలయ్య. అయితే అందులోనూ ఆప్యాయత ఉంది. అందుకే ఎదుటివాళ్లు కూడా అంతే వ్యంగ్యంగా సమాధానమిస్తారు.

మొగిలయ్య ఉదయాన్నే నిద్రలేచి పొలం పోతూ పాలు పితుకుతున్న వానితో "ఇంకా పిండుతున్నావురా పాలు నీయక్క!" అని అంటాడు. దానికి "పొద్దు పొద్దునే మొదలెట్టినావురా నీపాసుగాల!" అని ధీటుగా సమాధానమిస్తాడు. ఇక్కడ అసలు విషయమేమిటంటే పలకరించుకోవడానికి ఏదో ఒక సందర్భం కావాలి.

కొంతమంది ప్రతి వాక్యానికి చివర రామ రామ అనడం చూస్తూ ఉంటాం. ఉత్తర భారతదేశంలో కూడా రామ్ రామ్ అంటూ ఉంటారు. అలానే ఈ పాటలో యాప పుల్లలా చేదు నమిలిందే రామ రామ రామా అని ప్రయోగించాడు. నేలను తల్లిగా పోల్చటం, కళ్లాపి జల్లడం ఆ తల్లికి తలంటు పోయడంలాగా, ముగ్గులేయటం బొట్టు పెట్టినట్లు ఉందట. పల్లెల్లో రాత్రి వండుకున్న అన్నం పొద్దున్నే టిఫిన్లాగా తినేదాన్ని చద్దన్నం అంటారు. రాత్రి అన్నాన్ని మట్టికుండలో వేసి పాలు పోసి కాసింత తోడేసి ఉదయం ఉల్లిపాయతో తింటే చలువ చేస్తుంది. అందుకే 'పెద్దల మాట చద్దన్నం మూట' అంటారు కదా. అయితే ఉదయాన్నే వండిన వంటను మూట గట్టుకుని పొలంలో పనికి పోతూ ఉంటారు. దాన్ని కూడా సద్దిమూట అంటారు. పల్లె తెల్లారుతూ ఉంటే ఆ కాంతి కిరణాలు తెల్లనిపాల ధారలాగా ఉన్నాయి. గుడిలో గంటలు, ఎద్దుల మెడలో కట్టిన గంటలు జంటగా మోగుతున్నాయి. నాగలి భుజంపై పెట్టుకుంటే మిత్రుడు భుజం తట్టినట్లు ఉందట. నాగలి భుజంపై బరువు కాదన్నట్లు వేణు ఆనందంగా ఎడ్లతో పొలం పోతూ ఉంటాడు. కవి మార్కు ఇక్కడ కనబడుతుంది. పశువు, పొలం వుంటే కొండంత ఆస్తి ఉన్నట్లు చెబుతాడు. పూర్వం ఎన్ని కాడెడ్లు ఎక్కువ ఉంటే వారే ఆ ఊరిలో షావుకారు. ఆ ఆస్తే 'బలగం' అని చెబుతూ సినిమా టైటిల్ సాంగ్కు న్యాయం చేశాడు. దారి పొడుగునా చెట్ల కొమ్మల నుంచి గలగలా రాలే పూలు చప్పట్ల లాగా ఉన్నాయట. చెమటచుక్కను మట్టి గంధంతో పోల్చాడు. పల్లెను అమ్మతో పోలుస్తూ ఉన్నాడు. ఆ అమ్మ ఎలాంటిదట? తాను తినకుండా కొడుకు కోసం పైటకొంగు చివరన దాచిపెట్టే అమ్మట. రైతులు పంట పెరుగుతున్నకొద్దీ కన్నకూతురు ఎదుగుతున్నట్లు ఆనందిస్తారు.

**"ఇంకా పిండుతున్నావురా పాలు నీయక్క!" అంటాడు మొగిలయ్య. దానికి "పొద్దు పొద్దునే మొదలెట్టినావురా నీపాసుగాల!" అని ధీటుగా సమాధానమిస్తాడు.**

**పల్లె వర్ణన:** పల్లెను వర్ణిస్తూ, పల్లెలో వంద ఇళ్లు ఉన్నాయనకుండా వంద గడపలు వున్నాయన్నాడు. గోడ కట్టని గూడులాగా, చెరువులో స్వేచ్ఛగా తిరిగే చేప పిల్లలాగా ఆ పల్లె ఉందన్నాడు. మామా, అత్తా, బావా అని వరసలతో పిలుచుకుంటూ ఉంటే ఊరంతా చుట్టాల లాగానే ఉందట. పూలదండలోని దారంలాగా కాదట. దారంలో ఒదిగిన పూలదండలాగా ఆ సింగిడి పల్లె ఉంది. చేతనైతే సహాయం చేస్తారే కానీ మోసం ఎరుగని మనుషులు. వారి మనసులు మావి కాసినట్లు నిండుగా ఉంటాయట. ఇది మనిషి చచ్చేదాకా గుర్తుకు ఉంటుందని తెలంగాణా మాండలికంలో అత్యద్భుతంగా రాశాడు కాసర్ల శ్యామ్.

**పాట చిత్రీకరణ:** పచ్చ గడ్డి మోస్తూ పల్లెటూరు చిన్నది పాట మొదలు పెడుతుంది. మొగిలయ్య పొలం పోవడానికి సిద్ధపడుతూ ఉంటాడు. ఎనుముల్ని తోలుకుపోవటం, చలిమంట వేసుకొని వేప పుల్ల నమలటం, పిల్లాడికి స్నానం చేయించటం, కళ్లాపి జల్లటం, ముగ్గులు పెట్టటం, సాయిబు సాంబ్రాణి వేసి నెమలి ఈకలతో తలపై ఆశీర్వదించటం, గుడిలో గంట మోగటం, ఎద్దులను ఆప్యాయంగా నిమరటం, పిల్ల కాలువల్లో పిల్లలు ఈత కొడుతూ నీళ్లతో ఆడుకోవడం, ముత్తయిదువులకు పసుపు, గంధం పూయటం, దరువు తగ్గట్లు అడుగేయటం మొ॥ అందంగా చిత్రీకరించారు. మొగుడు, పెళ్లాల కొట్లాట, టీ కొట్టు దగ్గర వచ్చిపోయేవారిని పలకరించటం, అన్నం కలిపి అందరికీ చేతుల్లో పెట్టటం, ఆనందంగా నవ్వుకోటం, ఎడ్లబండి చక్రాన్ని ఎత్తి తోస్తుంటే మెచ్చుకుంటున్న పడతుల్ని చూసి మీసం మెలెయ్యటం చాలా బాగుంది.

పాట ప్రోమో వీడియోలో కూడా బాగా చిత్రీకరించారు. పట్టుచీర కట్టుకొని మంగ్లీ పొలం గట్టుపై పాడుతూ ఉంటుంది. మేకపిల్లను ఎత్తుకొని రామ్ పాడుతూ వస్తాడు. ఇద్దరూ ఎద్దుల బండిపైన వెళ్లటం, ట్రాక్టర్తో పొలం దున్నుతున్నప్పుడు రామ్ స్టీరింగ్ తిప్పిన తీరుగా పాట అందంగా సాగుతుంది. మంగ్లీ నాట్లు వేయటం, రామ్ పిల్లల మధ్య కూర్చొని పాట పాడటం చాలా బాగుంది. మొత్తంగా చూస్తే ఈ పాట సంగీత సాహిత్య పరంగా మనసుపై చెరగని ముద్ర వేస్తుంది.

**- కె.హరి మధుసూదనరావు**

సింగిల్ పేజీ కథ

# చిన్న కోడలు

కాలింగ్ బెల్ శబ్దం విని గబగబా వెళ్లి తలుపు తీసింది అన్నపూర్ణ. ఎదురుగా రెండో కొడుకు కార్తిక్, కోడలు దేవయాని నిలబడి వున్నారు.

"లోపలికి రండి, వెళ్లిన పని ఏమయింది? కుతూహలంగా అడిగింది అన్నపూర్ణ, స్కానింగు సెంటర్‌కి వెళ్లివచ్చిన వాళ్లని చూసి. "అమ్మా, నీకు మనవడు పుట్టబోతున్నాడమ్మా?" అన్నాడు కార్తిక్ సంతోషంగా.

ఏడుకొండలవాడా, ఇన్నాళ్లకి నా మొర ఆలకించావా తండ్రీ. నేను చెప్పినట్టుగానే నీ మొక్కు తప్పకుండా తీర్చుకుంటాను స్వామీ!" అంటూ చేతులెత్తి దేవుడి ఫొటోలకి నమస్కారం చేసింది అన్నపూర్ణ.

అన్నపూర్ణకి ఇద్దరు కొడుకులు. కార్తిక్‌కి ఐదేళ్లు వున్నప్పుడే భర్త చనిపోవడంతో పిల్లలిద్దర్నీ చాలా కష్టపడి పెంచి పెద్ద చేసింది. ఇద్దరికీ దేవుడి దయవల్ల ప్రభుత్వ ఉద్యోగాలు దొరికాయి. పెద్ద అబ్బాయి గణేష్‌కి ఇద్దరూ ఆడపిల్లలే. రెండో కొడుక్కైనా మగపిల్లవాడు పుట్టాలని ఊర్లో వున్న దేవుళ్లందరికీ అప్లికేషన్ వేసేసింది అన్నపూర్ణ. దాని ఫలితమో ఏమోగానీ అన్నపూర్ణ కోరిక ఫలించింది. వీరి మాటలు విన్న పెద్దకోడలు శ్రీదేవి వంటగదిలో నుంచి బయటికి వచ్చి దేవయానికి, కార్తిక్‌కి శుభాకాంక్షలు చెప్పింది.

కార్తిక్ "అమ్మా, నేను ఆఫీసుకు వెళ్తున్నానమ్మా. వస్తాను వదినా, వస్తాను దేవ్. నువ్వు రెస్టు తీసుకో" అంటూ ఆఫీసుకు వెళ్లిపోయాడు కార్తిక్.

దేవయానిని రెస్టు తీసుకోమని చెప్పి అన్నపూర్ణ వంటగదిలోకి వెళ్లి "ఏం చేస్తున్నావు శ్రీదేవీ?" అని అడిగింది.

"వంటపని అయిపోయింది. పిల్లలకి టిఫిన్ బాక్సులు తయారు చేస్తున్నాను అత్తయ్యా" అంది. "అయితే నేను బాక్సులు తీసుకుని స్కూలుకి వెళ్లి వాళ్లకు అన్నాలు పెట్టి వస్తానుగానీ, పోయిన వారం నువ్వు చేసిన కొబ్బరి అన్నం, మైసూర్‌పాక్ దేవయానికి బాగా నచ్చాయి. ఇప్పుడు దానికి అవి చేసిపెట్టు" అంది అన్నపూర్ణ ఆర్డరు వేస్తున్నట్టుగా. "అలాగే అత్తయ్యా, ముందు పిల్లలకి అన్నం తినిపించేసి వచ్చి చేస్తాను" అంది. "నేను తినిపించి వస్తానన్నానుగా, నువ్వు చేసి పెట్టు" అంది అన్నపూర్ణ. "నేను తినిపిస్తేనే చిన్నది తింటుంది అత్తయ్యా" "నేను తినిపించినా తింటుంది. ఈ ఇంటికి వారసుడ్ని ఇవ్వబోతున్న దేవయాని తర్వాతే ఎవరైనా, ఏదైనా" అంటూ బాక్సులున్న సంచిని శ్రీదేవి దగ్గర్నించి తీసుకుని బయల్దేరిపోయింది అన్నపూర్ణ.

రూములో పడుకుని వున్న దేవయాని వాళ్ల మాటలన్నీ వింది. మొదటిసారిగా శ్రీదేవి మొఖం చిన్నబుచ్చుకోవడం చూసి మనసులో కొంచెం బాధపడింది.

ఆ రోజు ఇంటి వాతావరణం అంతా చాలా ఆనందంగా వుంది. పెద్ద కోడలు శ్రీదేవి పనులన్నీ ముగించుకుని రోజూ చూసే తనకిష్టమైన టీవీ సీరియల్ చూస్తోంది. సరిగ్గా అప్పుడే దేవయాని అక్కడికి వచ్చి "అక్కా, ఇవాళ ఇండియా-పాకిస్తాన్ వన్ డే.. డే అండ్ నైట్ మ్యాచ్ జరుగుతోంది. ఒక్క నిమిషం స్కోరు చూసి ఇచ్చేస్తాను" అని అడిగింది. "భలేదానివే, సీరియల్‌దేముంది దేవయానీ! నువ్వు మ్యాచ్ పెట్టుకుని చూడు" అంది అన్నపూర్ణ.

"ఇంకో ఐదు నిమిషాల్లో సీరియల్ అయిపోతుంది. అప్పట్నించి దేవయాని మ్యాచ్ చూసుకోవచ్చు అత్తయ్యా" అంది శ్రీదేవి.

"వీల్లేదు.. నేను ఇంతకు ముందే చెప్పాను. ఈ ఇంట్లో నా చిన్న కోడలు తర్వాతే ఎవరైనా" అంటూ టీవీ రిమోట్‌ని శ్రీదేవి చేతిలో నించి తీసుకుని చటుక్కున ఛానల్ మార్చేసింది అన్నపూర్ణ.

అక్కడ్నించి లేచి వెళ్లిపోయింది శ్రీదేవి.

"ఛానల్ మార్చమని అడిగి అక్కని బాధపెట్టానని" అనుకుంటూ నిశ్శబ్దంగా నిలబడిపోయింది దేవయాని. ఆరోజు రాత్రి గదిలో కార్తిక్ ఆఫీసు ఫైల్ చూసుకుంటున్నాడు. దేవయాని వచ్చి గది తలుపులు వేసి కార్తిక్ పక్కన కూర్చుని "ఏమండీ" అని పిలిచింది.

"ఏమిటి చెప్పు?" అన్నాడు ఫైల్‌ని మూసి పక్కన పెడుతూ.

"మిమ్మల్ని ఒకటి అడగాలి"

"ఏం అడుగుతావో నాకు తెలుసు దేవా? ఈసారి జీతం రాగానే నువ్వు కోరిన వాచ్ తప్పకుండా తీసుకుంటాను" అన్నాడు కార్తిక్.

"అది కాదండీ! ఇంకోటి అడగాలను కుంటున్నాను" "నువ్వు ఏం అడిగితే అది ఇస్తాను. అడుగు దేవా" "అడిగిన తర్వాత నన్ను తిట్టకూడదు.

"ఏం అడగాలనుకు న్నావో అడుగు".

"నేను అబార్షన్ చేయించుకోవాలను కుంటున్నాను" అంది చాలా తాపీగా.


"నోర్ముయ్" కార్తిక్ కోపంతో ఊగిపోసాగాడు. అంతలోనే తనని తాను సంబాళించుకుని "చూడు దేవా, నాకు ఊహ తెలిసిన దగ్గర్నించి మా అమ్మ తనకంటూ ఏమీ అడగలేదు. ఇంటిపేరు నిలబెట్టడానికి ఒక వారసుడు కావాలని కోరుకుంది. అన్నయ్యకి ఇద్దరు ఆడపిల్లలు. నాకైనా మగపిల్లవాడు పుట్టకపోతాడా అన్న ఆశతో బతుకు తోంది. ఇన్నాళ్లకి అమ్మకోరిక తీరబోతోం దని అందరూ సంతోషపడుతుంటే ఆమె ఆశల్ని తుంచెయ్యాలనుకుంటున్నావా?" అన్నాడు ఆవేశంగా.


"అత్తయ్య మా ఇద్దర్నీ బాగా చూసు కుంటుంది. కానీ ఉదయం మన విషయం చెప్పిన దగ్గర్నించి అత్తయ్య పూర్తిగా మారిపోయింది. అక్కని సూటిపోటి మాటల్తో బాధపెడుతోంది. నన్ను తల మీద పెట్టుకుంటోంది. ఇప్పుడే ఇలా వుంటే మనకి అబ్బాయి పుట్టిన తర్వాత ఆవిడ ఎలా ప్రవర్తిస్తారోనని తలచుకుంటేనే భయంగా వుంది. దీనివల్ల ముందు మా ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభం కావొచ్చు. తర్వాత మీ అన్నదమ్ముల మధ్య మనస్పర్థలు ప్రారంభమై కుటుంబాలు విడిపోవచ్చు. 'అందరూ ఎంచక్కా కలిసివుంటారో' అని ఇన్నాళ్ళు అందరూ అనుకున్నదాన్ని మనం పాడుచేసినవాళ్లమవుతాం. ఈ కుటుంబం ముక్కలైపోవడానికి మనం కారణం కాకూడదండీ. అందుకే అబార్షన్ చేయించుకుని, మనకీ ఆడపిల్ల పుట్టేవరకు ఎదురుచూద్దామని అంటు న్నాను. ఆడపిల్లలంటే తక్కువేం కాదు. ఈ కాలంలో ఆడపిల్ల అయినా మగపిల్లా డైనా ఒకటే. ఆడపిల్ల అయినంత మాత్రాన ఇంటిపేరు నిలబడదా? అలా అని ఎవరు చెప్పారండీ? నిజం చెప్పా లంటే అబ్బాయిల కన్నా అమ్మాయిలే కుటుంబాలకి గౌరవం తెస్తున్నారన్నది పచ్చి నిజం" అంది శ్రీదేవి క్లారిటీగా.


కార్తిక్‌కి తన భార్య ఎంతో ఎత్తుకి ఎదిగిపోయినట్లు అనిపించింది. "దేవా! నీలా నేను ఆలోచించలేకపోయాను. యూ ఆర్ గ్రేట్‌రా" అంటూ దేవయాని కోరికను సమ్మతించాడు.

"మిమ్మల్ని ఒకటి అడగాలి" "ఏం అడుగుతావో నాకు తెలుసు దేవా! ఈసారి జీతం రాగానే నువ్వు కోరిన వాచ్ తప్పకుండా తీసుకుంటాను" అన్నాడు కార్తిక్.

**- వసంతకుమార్ సూరిశెట్టి**


ఏడు సం॥లు కనిపించకుండా పోయినా.. ఏడు రోజులు ఆన్‌లైన్ లోకి రాకపోయినా.. సదరు మనిషి బతికి లేనట్లుగా భావించాలి. ఆస్తిని వారసులకు పంచాలి మిలార్డ్..!!
Zakir...


కలలు కూడా దరిద్రమైనవే వస్తున్నాయా...?
'రిచ్' కలలు వచ్చేలా చేయాలా...?!
మానసిక నిపుణుడు
Zakir...


అతని జాతకం లో ఇప్పట్లో 'అరెస్ట్' లేదండీ...
మేమేటి సేత్తాం...!!?
CBI
Zakir...

ఈ వారం కా'ర్టూన్స్'





ఫోటో ఫీచర్





చైనావాసులు వైవిధ్యంగా ఆలోచించి పచ్చని తేయాకు తోటల మధ్య రంగు రంగుల చెర్రీ పూలచెట్లను పెంచుతున్నారు. కొన్ని వేల ఎకరాల తేయాకు తోటల మధ్య పెంచిన ఈ చెర్రీ పూలచెట్లు విరగబూయడంతో ఆ ప్రాంతం పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది. చెర్రీ పూల అందాలను మీరూ ఆస్వాదించాలంటే చైనాలోని ఝుంపింగ్‌లో ఉన్న ఫుజియన్ ప్రావిన్స్‌ను సందర్శించండి మరి..!

